ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 140, పేజీలు - 08
ఆదివారం, నవంబర్ 22, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

సైబరాబాద్‌కు ట్విన్ టవర్స్

- రూ.169 కోట్లతో సీఎంసీ కొత్త భవనం!

- 12 నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేయాలని లక్ష్యం - 195 మందితో కౌన్సిల్ హాల్.. 400 మందికి ఆడిటోరియం

- ఏడో అంతస్తులో కమాండ్ కంట్రోల్ సెంటర్ - సౌర విద్యుత్తు వ్యవస్థతో ఆధునిక సదుపాయాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భాగ్యనగరంలో మరో భారీ ప్రభుత్వ భవన నిర్మాణానికి రంగం సిద్ధమైంది. సైబరాబాద్ నగరపాలక సంస్థ (సీఎంసీ)కు అత్యాధునిక హంగులతో ట్విన్ టవర్స్ తరహాలో కొత్త ప్రధాన కార్యాలయం నిర్మించనున్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ప్రాంతంలో ఖానామెట్ వద్ద హైటెక్స్, నోవాటెల్ మధ్య 4.11 ఎకరాల విస్తీర్ణంలో ఈ భవనం రూపుదిద్దుకోనుంది. ఇందుకు సంబంధించి సీఎంసీ ఇంజినీరింగ్ విభాగం టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రాజెక్టుకు మొత్తం రూ.169 కోట్ల అంచనా వ్యయం నిర్ణయించగా, పన్నులు మినహాయించి రూ.125.79 కోట్లను కాంట్రాక్టు విలువగా ఖరారు చేశారు. స్పెషల్ క్లాస్ కాంట్రాక్టు సంస్థలు మాత్రమే టెండర్లలో పాల్గొనేందుకు అర్హత కల్పించారు. ఒప్పందం కుదిరిన నాటి నుంచి 12 నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సుమారు 2.5 లక్షల చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణంతో స్టిల్ట్ ప్లస్ ఎనిమిది అంతస్తుల్లో ఈ కార్యాలయాన్ని నిర్మించనున్నారు.

ఐటీ కంపెనీ క్యాంపస్‌ను తలపించేలా డిజైన్

ప్రస్తుతం సీఎంసీ ప్రధాన కార్యాలయం హైటెక్స్ సమీపంలోని న్యాక్ భవనంలో తాత్కాలికంగా కొనసాగుతోంది. శాశ్వత కార్యాలయం ఆధునిక సాంకేతికత, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఐటీ కంపెనీ క్యాంపస్‌ను తలపించేలా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ మేరకు కమిషనర్ జి.సృజన ఆధ్వర్యంలో పలు నమూనాలను పరిశీలించి ట్విన్ టవర్స్ డిజైన్‌ను ఖరారు చేశారు. ఖానామెట్‌లో నిర్మించనున్న ఈ భవనం వెనుక భాగంలో చెరువు ఉండేలా ప్రణాళిక రూపొందించారు. రెండు టవర్లలో ఒకటి ఆరు అంతస్తులు, మరొకటి ఎనిమిది అంతస్తులతో నిర్మితమవుతాయి. భవనం వెలుపలి భాగంలో ముదురు కాఫీ రంగు అద్దాలను అమర్చనున్నారు. ప్రతి అంతస్తులోనూ అన్ని వైపుల నుంచి సహజమైన గాలి, వెలుతురు వచ్చేలా ప్రత్యేక డిజైన్ రూపొందించారు.

మొదటి అంతస్తు.. ప్రజల కోసం ప్రత్యేకం

ప్రజలకు అవసరమైన పౌరసేవలు, ప్రజాప్రతినిధుల సమావేశాలు ఒకే చోట

2లో..

సవాళ్లకే సవాళ్లు విసరకుండా
నేను ఉండలేను

- ఐఐటీ ఖరగ్‌పుర్ వజ్రోత్సవాల్లో ప్రధాని మోదీ



ఖరగ్‌పుర్ (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్‌లోని ఐఐటీ- ఖరగ్‌పూర్ ప్లాటినమ్ జూబ్లీ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ వేడుకలకు గుర్తుగా ప్రత్యేక నాణేన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ భవిష్యత్తును నిర్మించడంలో సాంకేతిక విద్యా సంస్థల పాత్ర, యువ ఇంజినీర్ల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. దేశ అవసరాలకు కావలసిన ప్రతి పరికరాన్నీ ఇక్కడే ఉత్పత్తి చేయాలనే దిశగా అడుగులు వేస్తున్నామని, ఈ క్రమంలో చిప్ నుంచి షిప్ వరకు అనే నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.
ఐఐటీ ఖరగ్‌పూర్ తన 100వ వార్షికోత్సవం జరుపుకునే సమయానికి భారత్ సంపూర్ణంగా అభివృద్ధి చెందిన దేశంగా మారాలని ప్రధాని మోదీ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడం కోసం నేటి యువత పూర్తి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. దేశాన్ని ఆర్థికంగా, సాంకేతికంగా అత్యున్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరూ కూడా తమ వంతు కృషి చేయాలని, ఇది అందరి బాధ్యత అని గుర్తు చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల

2లో..

తెలంగాణలో కాంగ్రెస్ పని
అయిపోయింది

- ఇక వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్న హరీశ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు జోస్యం చెప్పారు.తెలంగాణ భవన్‌లో ప్రతిరోజూ జరుగుతున్న పార్టీలో చేరికలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.ఖైరతాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, శ్రీనాథ్‌తో పాటు పలువురు నాయకులకు హరీశ్ రావు గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి హరీశ్ రావు మాట్లాడారు. అన్ని సర్వేల్లోనూ వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తేలుతోంది అని అన్నారు. తెలంగాణ ప్రజలంతా మళ్లీ కేసీఆర్ నాయకత్వం వైపు చూస్తున్నారని మాజీమంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పేర్కొన్నారు.

2లో..

గొర్రెతోలు కప్పుకున్న
తోడేలు

- "నారా స్వామ్యం"

స్థానిక ఎన్నికల తీరుపై జగన్ ట్వీట్



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మున్సిపల్, కార్పొరేషన్, జడ్పీటీసీ,

2లో..

వైసీపీ కుట్రలకు ఓటర్లే చెక్

- జిల్లా పరిషత్ ఎన్నికల్లో 96.42 శాతం స్టయిక్ రేట్
- సామాన్య కార్యకర్తలు, మహిళలకు పదవుల్లో అధిక ప్రాధాన్యం
- వైసీపీ కుట్రలను ప్రజలు తిప్పికొట్టారన్న ముఖ్యమంత్రి
- ప్రజాప్రతినిధుల పనితీరు ఆధారంగా తగిన చర్యలు ఉంటాయని స్పష్టీకరణ



అమరావతి (ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ పన్నిన కుట్రలు, కుతంత్రాలను ప్రజాస్వామ్యబద్ధంగా తిప్పికొట్టిన రాష్ట్ర ఓటర్లకు హ్యాట్సాఫ్ చెబుతున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారనే విషయాన్ని ఈ తీర్పు మరోసారి రుజువు చేసిందని స్పష్టం చేశారు. ఎన్నికలు జరగకుండా ఆపేందుకు కోర్టుల్లో 63 పిటిషన్లు వేసి, బీసీ రిజర్వేషన్లు, డీలిమిటేషన్ పేరిట అడ్డంకులు సృష్టించారని, హింసకు పాల్పడుతూ ఎదురు ఫిర్యాదులు చేసిన వైసీపీ డ్రామాలను ప్రజలు ఏమాత్రం నమ్మలేదని సీఎం మండిపడ్డారు.

ముగ్గురు టీడీపీ నేతలు అలిగారు.. అలా అలగడం నాకు నచ్చలేదు!

రాజకీయాల్లో డబ్బిస్తే ఓటేస్తారనే భావన పోయిందని, ఇటీవల ఒక ఓటరు అభ్యర్థి ఇచ్చిన డబ్బును ఏకంగా బ్యాలెట్ బాక్సులోనే వేసి తిరస్కరించడం

2లో..



హైదరాబాద్‌లో విచ్చలవిడిగా డ్రగ్స్

- టెర్రాస్‌లపై గంజాయి పెంచుతున్నారని ఆందోళన

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారత్‌కు అతిపెద్ద ఆస్తి యువతేనని, అయితే నేటి యువత డ్రగ్స్ బారిన పడుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శ్రీసత్యసాయి నిగమాగమంలో నిర్వహించిన 'సిటీ కన్వెన్షన్ ఆన్ డ్రగ్ ఫ్రీ ఇండియా' మెగా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా నగరంలో డ్రగ్స్ వ్యాప్తిపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

పంజాబ్‌ను నిర్వీర్యం చేసింది.. ఇప్పుడు హైదరాబాద్‌లో

గతంలో పంజాబ్ రాష్ట్రాన్ని డ్రగ్స్ పూర్తిగా నిర్వీర్యం చేసిందని గుర్తుచేసిన కిషన్‌రెడ్డి, ప్రస్తుతం హైదరాబాద్‌లోనూ డ్రగ్స్ చలామణి విచ్చలవిడిగా కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు బానిసైన యువత మత్తులో తాము ఏం చేస్తున్నారో కూడా తెలుసుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. నగరంలోని మూతపడ్డ కంపెనీలను అడ్డాలుగా చేసుకుని డ్రగ్స్ తయారు చేస్తున్నారని, అంతేకాకుండా పలుచోట్ల ఇళ్ల టెర్రాస్‌లపై కూడా గంజాయి మొక్కలను పెంచుతున్నారని సంచలన విషయాలు వెల్లడించారు.

2లో..

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై
హైకమాండ్ సీరియస్

- ఈ నెల 23న కలవాలని ఫోన్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్ అయినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయనకు హైకమాండ్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. రాజగోపాల్ రెడ్డికి ఫోన్ చేసిన ఏఐసీసీ కార్యదర్శి.. ఈ నెల 23న కొత్త ఇన్‌ఛార్జ్ బీఎం సందీప్‌తో సమావేశం కావాలని సూచించారు. ఇదిలా ఉండగా, రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువైందని, రాజగోపాల్ రెడ్డి, అనిరుద్ రెడ్డి పై వ్యాఖ్యలను ఏఐసీసీ పరిశీలిన చేయనుందని తెలిపారు. క్రమశిక్షణ చర్యలపై స్పందించి, సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. కొండా సురేఖ

2లో..

గోదావరి పుష్కరాలకు
మహా ఏర్పాట్లు

- భారీ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

- 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు పుష్కరాలు - 22 శాఖల పరిధిలో 4,862 పనులకు ప్రతిపాదనలు - భక్తుల కోసం 440 ఘాట్లలో విస్తృత సదుపాయాలు
- 4 వేల ఆర్టీసీ బస్సులు.. 1,560 ప్రత్యేక రైళ్లు



అమరావతి (ప్రశ్న న్యూస్) 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు ఈ పుష్కరాలు జరగనున్నాయి. ఈ పవిత్ర మహోత్సవానికి దేశవిదేశాల నుంచి సుమారు 10 కోట్ల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

రూ.3,723 కోట్లతో అభివృద్ధి పనులు

పుష్కరాల నిర్వహణ నిమిత్తం మొత్తం 22 శాఖల పరిధిలో రూ.3,723.69 కోట్ల అంచనా వ్యయంతో 4,862 పనులకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేశారు. వీటిలో ఇప్పటికే రూ.2,051.70 కోట్ల విలువైన 2,260 పనులకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ప్రస్తుతం దాదాపు రూ.649.70 కోట్ల విలువైన 659 పనులు ప్రారంభం కాగా, రూ.25.53 కోట్ల విలువైన

2లో..

ఆట పెర్‌ఫెక్ట్‌గా ఆడుతున్నాం మళ్లీ గోల్ కొడతాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, లోపభూయిష్టమైన డిజైన్లు, నిర్మాణంలో పాటించని సాంకేతిక ప్రమాణాలే ప్రధాన కారణమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల

3లో..

హైదరాబాద్‌లో నాలుగు హోటళ్ల లైసెన్సులు రద్దు

2లో..

- నిబంధనలు ఉల్లంఘించారని కఠిన చర్యలు



సైబరాబాద్‌కు ట్విన్ టవర్స్

నిర్వహించుకునేలా అంతర్గత విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. మొదటి అంతస్తును పూర్తిగా ప్రజల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నారు. ఇందులో 195 మంది కూర్చునే సామర్థ్యంతో కౌన్సిల్ హాల్, ప్రజావాణి కేంద్రం, వీఐపీల గది, డైనింగ్ హాల్, మీడియా గది ఏర్పాటు చేయనున్నారు. రెండో అంతస్తులో మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ కార్యాలయాలతో పాటు స్థాయీ సంఘం సమావేశ మందిరం, ఫ్లోర్ లీడర్ల క్యాబిన్లు, సెక్రటరీ కార్యాలయం కొలువుదీరనున్నాయి.

విభాగాల వారీగా అంతస్తుల కేటాయింపు

మూడో అంతస్తులో పరిపాలన, ఆర్థిక విభాగాలకు సంబంధించిన కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. అదనపు కమిషనర్ల కార్యాలయాలతో పాటు జనరల్ బ్రాంచి, కార్మిక సంక్షేమం, విజిలెన్స్ విభాగాలకు స్థలం కేటాయించారు. నాలుగో అంతస్తులో క్రీడలు, హైడ్రా, విద్యుత్తు, జలమండలి అధికారుల కార్యాలయాలతో పాటు పారిశుద్ధ్య విభాగం కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు. ఐదో అంతస్తును ప్రధానంగా ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, భూసేకరణ విభాగాలకు కేటాయించారు. ఆరో అంతస్తులో రెవెన్యూ, ఎన్నికలు, ఎస్టేట్స్, ఐటీ, ప్రకటనలు, జీఐఎస్, న్యాయ, పట్టణ పేదరిక నిర్మూలన, పట్టణ జీవనోపాధి తదితర విభాగాలకు కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. పలు ఇంజినీరింగ్ విభాగాలకు కూడా ఇక్కడ స్థలం కల్పించనున్నారు.

ఏడో అంతస్తులో కమాండ్ కంట్రోల్ సెంటర్

ఏడో అంతస్తులో 1,311 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. కమిషనర్, ఇతర ఉన్నతాధికారుల కోసం ప్రత్యేక గదులు నిర్మిస్తారు. భవనానికి అవసరమైన విద్యుత్తులో కొంత భాగాన్ని స్వయంగా ఉత్పత్తి చేసుకునేలా సౌర విద్యుత్తు వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నారు.

400 మందితో ఆడిటోరియం

ఎనిమిదో అంతస్తులో 3,270 చదరపు అడుగుల విస్తీర్ణంలో 400 మంది కూర్చునే సామర్థ్యంతో ఆధునిక ఆడిటోరియం నిర్మించనున్నారు. స్టిల్ట్ ప్రాంతంలో ప్రవేశ ద్వారాలు, మీ సేవా, పౌరసేవా కేంద్రాలు, పార్కింగ్ సదుపాయం, పార్కు, మురుగునీటి శుద్ధి కేంద్రం, శౌచాలయాలు ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 16,668 చదరపు మీటర్ల భూమిలో నిర్మించనున్న ఈ కార్యాలయం అందుబాటులోకి వస్తే సైబరాబాద్ నగరపాలక సంస్థకు శాశ్వత పరిపాలనా కేంద్రం ఏర్పడనుంది. అంతేకాకుండా ప్రజలకు అవసరమైన వివిధ పౌరసేవలు ఒకే చోట అందుబాటులోకి రానున్నాయి. అత్యాధునిక సదుపాయాలు, సమీకృత పరిపాలనా వ్యవస్థతో ఈ ట్విన్ టవర్స్ సీఎంసీకి కొత్త గుర్తింపుగా నిలవనున్నాయి.

సవాళ్లకే సవాళ్లు విసరకుండా నేను ఉండలేను

త్యాగాలను ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధులు స్వేచ్ఛా భారత్ కోసం దృఢమైన సంకల్పం తీసుకున్నారని, ఆ పట్టుదలతోనే 20 ఏళ్లలో దేశానికి సిద్ధించిందని చెప్పారు. అదే తరహాలో రాబోయే 20 ఏళ్ల కాలంలో వికసిత్ భారత్‌ను మార్చడానికి యువత నిరంతరం శ్రమించాలని సూచించారు. స్వామి వివేకానంద చెప్పిన లేవండి, మేల్కొనండి, లక్ష్యం చేరేవరకు విశ్రమించకండి" అనే సూక్తిని ప్రధాని ఉదహరించారు.ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన నివేదికను ప్రధాని మోదీ ప్రస్తావించారు. 20 ఏళ్ల కిందటి వరకు నాటి పాలకులు దేశంలో పేదరికాన్ని ఒక శాశ్వత సమస్యగా పరిగణించేవారని, అయిదు దశాబ్దాల క్రితం ఎర్రకోట నుంచి పేదరికాన్ని నిర్మూలించాలని నినాదాలు చేశారని గుర్తు చేశారు. విధానపరంగా చర్యలు తీసుకోవాల్సిన సమయం వచ్చినప్పుడల్లా, వ్యవస్థ మొత్తం కూడా నిష్క్రియంగా ఉండేదని పేర్కొన్నారు. దీన్ని తాము అధిగమించామని చెప్పారు.13 సంపత్సరాల అతి తక్కువ వ్యవధిలోనే దేశంలో సుమారు 50 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి వెలుపలికి రావడం చారిత్రక పరిణామమని కొనియాడారు. ఇది ఒక్కసారిగా సంభవించిన మార్పు కాదని, సంకుచిత ఆలోచనలను వీడి సరిహద్దులను చెరిపివేసే మనస్తత్వంతో పనిచేయడం వల్లే సాధ్యపడిందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సవాళ్లను ఎన్నో అధిగమించగలిగామని అన్నారు. సవాళ్లకే సవాళ్లు విసరకుండా తాను ఉండలేనని తేల్చి చెప్పారు. దేశంలో సెమీకండక్టర్ మిషన్‌ను ప్రారంభించిన సమయంలో అనేక విమర్శలు, ప్రతికూల ప్రశ్నలు ఎదురయ్యాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. 50 ఏళ్ల క్రితం ఒక సంస్థ సెమీకండక్టర్ల తయారీకి భారత్‌కు రావాలని భావించినప్పటికీ అప్పటి ప్రభుత్వ నిర్ణయాల వల్ల ఆ అవకాశాన్ని కోల్పోవాల్సి వచ్చిందని వివరించారు. గతంలో ఆలస్యమైందనే నెపంతో ఇప్పుడు కూడా తాము మౌనంగా కూర్చోలేమని, అందుకే ప్రణాళికాబద్ధంగా తో స్వదేశీ సెమీకండక్టర్ రంగాన్ని ముందుకు తీసుకెళ్తోన్నామని తెలిపారు.

తెలంగాణలో కాంగ్రెస్ పని అయిపోయింది

సీఎం రేవంత్ రెడ్డిపై సొంత పార్టీ ఎమ్మెల్యేల విమర్శలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే విమర్శలు చేస్తున్నారని...ప్రభుత్వంలో అంతర్గత అసంతృప్తి పెరిగిపోయిందని మాజీమంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. మాజీమంత్రి దానం నాగేందర్ పార్టీ మార్పుపై హైకోర్టు అనర్హత వేటు వేసిందని వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో నగరం బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని ఆరోపించారు.గతంలో తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా నగర ప్రజలు సంతోషంగా ఉండేవారని, ఇప్పుడు నీటి కొరత, ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితి ఏర్పడిందని మాజీమంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు.

వైద్య రంగంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

కాంగ్రెస్ ప్రభుత్వంలో హైదరాబాద్‌లో మళ్లీ తాగునీటి సమస్యలు, విద్యుత్ కోతలు, దోమల బెడద పెరిగాయని మాజీమంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన 10 లక్షల నీసీ కెమెరాల్లో సగం పనిచేయడం లేదని ఆరోపించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. వైద్య రంగంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో మందులు అందుబాటులో లేవని, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ పథకాలు నిలిచిపోయాయని ధ్వజమెత్తారు. టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణం, సేవల విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మాజీమంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఘాటుగా విమర్శించారు.

మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్

విద్యారంగంలో మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయక విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందని మాజీమంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.20 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఖర్చు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం రూ.600 కోట్లు కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. పెన్షన్ల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, బీఆర్ఎస్ హయాంలో 43 లక్షల మందికి పెన్షన్లు అందించామని, కొత్తగా మరో 17 లక్షల పెన్షన్లు ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4 వేల పెన్షన్ హామీని అమలు చేయడంలో విఫలమైందని మాజీమంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విమర్శించారు.

బీజేపీ, కాంగ్రెస్ కలిసి తెలంగాణను ఆగం చేస్తున్నాయి

మరోవైపు కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ కలిసి తెలంగాణకు అన్యాయం చేస్తున్నాయని మాజీమంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నా కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందలేదని, కరువు బృందాలు కూడా రాలేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం సహకరిస్తూ తెలంగాణను విస్మరిస్తోందని మాజీమంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావువిమర్శించారు.

గొర్రెతోలు కప్పుకున్న తోడేలు

ఎంపీటీసీ ఎన్నికలతో పాటు తాజాగా జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లోనూ పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరిగిందని ఆయన ఆరోపించారు.

ఈ మేరకు తన "ఎక్స్" వేదికగా సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఎన్నికల సంఘం, అధికార యంత్రాంగం తీరుపై ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని "నారా స్వామ్యం"మే నడుస్తుందని ఎద్దేవ చేశారు. ఎన్నికల సందర్భంగా జరిగిన పలు ఘటనలకు సంబంధించినవిగా పేర్కొంటూ కొన్ని వీడియోలను కూడా షేర్ చేశారు.

వ్యవస్థలు ఒక్కటై

రాష్ట్రంలో స్వేచ్ఛాయుత, శాంతియుత, నిష్పక్షపాత ఎన్నికల విధానానికి తూట్లు పొడిచారని వైఎస్.జగన్ తన పోస్ట్‌లో విమర్శించారు. ఎన్నికల్లో అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడం, వేసిన నామినేషన్లను అధికారులే చింపేయడం, పోలింగ్ బూత్‌లను ఆక్రమించి ఓట్లను దొంగిలించడం వంటి అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు. దీంతోపాటు ఎన్నికల్లో గెలిచిన వారిని సైతం ఓడిపోయినట్టుగా ప్రకటించారని ఆరోపించారు. అలాగే రిటర్నింగ్ అధికారులు, పోలీసులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై ఎన్నికల ఫలితాలను శాసించారని జగన్ విమర్శలు గుప్పించారు.

దాడులు, తప్పుడు కేసులపై ఆగ్రహం

గత ఐదేళ్ల తమ పాలనలో రాష్ట్రం శాంతియుతంగా సుస్థిరంగా కొనసాగిందని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు భ్రష్టుపట్టాయని వైఎస్ జగన్ పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిలపై హత్యాయత్నాలు జరిగాయని ఆయన ఆరోపించారు. తాడిపత్రిలో పెద్దారెడ్డి ఇంటిపై వందల మందితో దాడి చేసి, పోలీసుల సమక్షంలోనే వాహనాలకు నిప్పంటించారని, అయితే దాడులకు పాల్పడిన వారిని వదిలేసి తిరిగి బాధితులపైనే తప్పుడు కేసులు బనాయించే ప్రజాస్వామ్యం ఇది, ఇవాళ మనకు కనిపిస్తుంది ఇదేనని జగన్ పోస్టులో రాసుకొచ్చారు. అలాగే పంచాయతీ ఎన్నికల్లో దారుణాలు జరిగాయని పేర్కొంటూ, వాటికి సంబంధించిన సాక్ష్యాలుగా నిలుస్తున్నాయంటూ వీడియోలనుఆయన ఎక్స్ వేదికలో షేర్ చేశారు.

వైసీపీ కుట్రలకు ఓటర్ల చెక్

ప్రజల చైతన్యానికి నిదర్శనమని చంద్రబాబు కొనియాడారు. ఇదే సమయంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల పనితీరుపై సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. కొందరు ఎమ్మెల్యేల పనితీరు పట్ల ప్రజల్లో అసంతృప్తి ఉందని, అలాంటి వారు వెంటనే తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. టికెట్ల కర్రబాటు సమయంలో టీడీపీలోని ముగ్గురు నేతలు అలిగారని, ఇంత శ్రమించి పనిచేస్తుంటే అలా అలగడం తనకు ఏమాత్రం నచ్చలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా లాంటి ప్రాంతాల్లో ఆశించిన ఫలితాలు రాలేదని, అక్కడ జరుగుతున్న బలవంతపు మతమార్పిడులు, ఇతర అంశాలపై క్షేత్రస్థాయి సమీక్ష జరుపుతామన్నారు.
వచ్చే పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా ఎదుగుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టం చేశారని సీఎం గుర్తుచేశారు. ప్రజలు ఇచ్చిన ఈ ఘనమైన తీర్పు తమపై మరింత బాధ్యతను పెంచిందని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా మరింత అంకితభావంతో ముందుకు సాగుతామని చంద్రబాబు స్పష్టం చేశారు.

కూటమికి తిరుగులేని ప్రజాదరణ - ట్రిపుల్ ఇంజిన్ సర్కార్

ఈవీఎం అయినా, బ్యాలెట్ పేపర్ అయినా, పోస్టల్ బ్యాలెట్ అయినా ప్రజల తీర్పు కూటమికే అనుకూలంగా ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక పోరులో కూటమి అపూర్వ విజయం సాధించిందని గణాంకాలతో వివరించారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో 96.42 శాతం స్ట్రయిక్ రేట్, మండల పరిషత్‌లలో 93.15 శాతం, మున్సిపల్ ఎన్నికల్లో 94 శాతం స్ట్రయిక్ రేట్‌ను కూటమి దక్కించుకుందని వెల్లడించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 39.81 శాతంగా ఉన్న వైసీపీ ఓటు బ్యాంకు, ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో 33.56 శాతానికి పడిపోయిందని, ఏకంగా 6.25 శాతం ఓట్లు ఆ పార్టీకి తగ్గాయని తెలిపారు. కూటమికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదరణ మరింత పెరిగిందని, ఈ ఘనవిజయంతో రాష్ట్రంలో 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్' ఏర్పాటైందని సీఎం పేర్కొన్నారు.

సామాన్య కార్యకర్తలు, విద్యావంతులకే జెడ్పీ పీఠాలు

రాజకీయాల్లో కుటుంబ పాలన, ధన ప్రభావానికి తావులేకుండా పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడిన సామాన్య కార్యకర్తలను, విద్యావంతులను ఉన్నత పదవుల్లో కూర్చోబెట్టామని సీఎం వివరించారు. జనాభా దామాషా పద్ధతిన అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో సమన్యాయం కల్పించామన్నారు. కర్నూలు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా 25 ఏళ్లకే ఎంబీబీఎస్ పూర్తి చేసిన షేక్ షాదికను, గంపలగూడెం జెడ్పీటీసీగా ఎంటెక్ చదివిన ఎస్సీ యువతి కోట పుల్లమ్మను గెలిపించుకున్నామని చెప్పారు. మొత్తం 22 జెడ్పీ చైర్‌పర్సన్ స్థానాల్లో 12 మహిళలకే ఇచ్చామని, వీరిలో 14 మంది ఉన్నత విద్యావంతులు ఉన్నారని తెలిపారు. అలాగే 20 జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ స్థానాల్లో 11 మహిళలకు కేటాయించగా అందులో 17 మంది గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లేనని వివరించారు.పల్నాడు జెడ్పీ చైర్‌పర్సన్‌గా యాదవ వర్గానికి చెందిన సామాన్య కార్యకర్త పుచ్చకాయల రమాదేవి, తూర్పుగోదావరిలో శెట్టిబలిజ వర్గానికి చెందిన కాడ పద్మ, కడప జెడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా ముస్లిం మహిళ హబీబున్నీసా, ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్‌గా పార్టీ యానిట్ ఇన్‌ఛార్జి కొక్కిలిగడ్డ ప్రభాకర్ రావు, నంద్యాల జెడ్పీ చైర్మన్‌గా క్లస్టర్ ఇన్‌ఛార్జి షేక్ బురహానుద్దీన్, పశ్చిమ గోదావరి వైస్ చైర్మన్‌గా బూత్ కన్వీనర్ నాగేశ్వరరావు, అన్నమయ్య జిల్లాలో బోయ సామాజిక వర్గానికి చెందిన తలారి శరణ్యలకు అవకాశం ఇచ్చి 'కార్యకర్తే అధినేత' అనే సిద్ధాంతాన్ని ఆచరణలో చూపించామని చంద్రబాబు పేర్కొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రజల ఆమోదం

గత ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేసి, రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామని సీఎం తెలిపారు. తీవ్ర ఎల్‌నినో ప్రభావం, వరుసగా రెండు తుఫాన్లు రాష్ట్రాన్ని తాకిన సమయంలో తమ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్పందించి ఆదుకుందన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ సంస్థలను రూ.1.30 లక్షల కోట్ల అప్పుల్లో ముంచి, ప్రజలపై రూ.32 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారం మోపిందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్ల కాలంలో కరెంటు ఛార్జీలు పైసా కూడా పెంచలేదని స్పష్టం చేశారు. పోలవరం ద్వారా గోదావరి జలాలను విశాఖపట్నం, కృష్ణా డెల్టాకు తరలించే దిశగా పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు.

హైదరాబాద్‌లో విచ్చలవిడిగా డ్రగ్స్

2029 నాటికి డ్రగ్స్ రహిత భారత్

యువతను ఈ మత్తు మహమ్మారి నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

ముఖ్యంగా హైదరాబాద్‌లోని ఐటీ ఉద్యోగులు, యువత, మేధావులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ముందుకొచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. 2029 నాటికి భారతదేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహిత దేశంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన తెలిపారు.

డ్రగ్స్ కేసులపై శ్వేతపత్రం - మహేశ్వర్‌రెడ్డి

ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ యువతను మత్తుకు బానిసలుగా మార్చి మన దేశాన్ని నాశనం చేయాలని ఇతర దేశాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. 'సషా ముక్త్ భారత్' సంకల్పం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ప్రభుత్వం ఎన్ని డ్రగ్స్ కేసులు నమోదు చేసింది? ఎంతమందిని అరెస్ట్ చేసింది? అనే వివరాలతో కూడిన శ్వేతపత్రాన్ని వెంటనే విడుదల చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై హైకమాండ్ సీరియస్

విషయంలో మొదటిసారి చర్యలు తీసుకోలేదని, రెండు మూడుసార్లు పరిశీలించిన తర్వాత అధిష్ఠానం చర్యలు తీసుకుందన్నారు.ఇటీవల ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి. తన నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

అభివృద్ధి అంటే కేవలం కొడంగల్, మధిర, హుజూర్‌నగర్ నియోజకవర్గాలే కాదని దుయ్యబట్టారు. మునుగోడు అభివృద్ధిని పట్టించుకోవడం లేదని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. అంతేకాదు, నిధులు ఇవ్వకుంటే మరో కురుక్షేత్రం తప్పదని ఆయన హెచ్చరించారు. ఇదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి మరో రెండేళ్లే పదవిలో ఉంటారని వ్యాఖ్యలు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అలాగే, అదృష్టం కొద్దీ దక్కిన అధికారంతో అవినీతికి పాల్పడే పాలకులను తెలంగాణ ప్రజలు, చరిత్ర ఎన్నటికీ క్షమించదని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. సిద్ధిపేట సభలో సీఎం రేవంత్ రెడ్డి తనను ఉద్దేశించి పరోక్షంగా చేసిన వ్యాఖ్యలకు ఆయన పై విధంగా కౌంటర్ ఇచ్చారు.ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జిగా నియమితులైన బి.ఎం.సందీప్ ఆదివారం(నవంబరు 22న) హైదరాబాద్‌కు రానున్నారు. గాంధీభవన్‌లో జరగనున్న రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)ల ఉమ్మడి సమావేశంలో ఆయన పాల్గొంటారు. తర్వాత నవంబరు 23న సోమవారం గాంధీభవన్‌లో ఉదయం మంత్రులతో, మధ్యాహ్నం నుంచి డీసీసీ అధ్యక్షులు, పీసీసీ అనుబంధ సంఘాల అధ్యక్షులతో సమావేశమవుతారు.

గోదావరి పుష్కరాలకు మహా ఏర్పాట్లు

69 పనులు పూర్తయ్యాయి. పనుల పురోగతి, నిధుల వినియోగాన్ని పారదర్శకంగా పర్యవేక్షించేందుకు అన్ని శాఖలు జిల్లాల వారీగా వివరాలను ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ప్రజా భాగస్వామ్యం - పకడ్బందీ ఏర్పాట్లు

ఈ పుష్కరాలను కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, యువత సహకారాన్ని పెద్దఎత్తున తీసుకోవాలని సూచించారు. విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఇప్పటి నుంచే శిక్షణ ఇవ్వాలని, శాఖల మధ్య సమన్వయం కోసం నిరంతరం సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

440 ఘాట్లు.. విస్తృత మౌలిక వసతులు

గోదావరి పరివాహక ప్రాంతంలోని 440 ఘాట్ల వద్ద భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర పారిశుధ్య నిర్వహణ, వ్యర్థాల తొలగింపు, తాగునీరు, విద్యుత్ దీపాల ఏర్పాటు కోసం రూ.464 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. వైదిక ఆచారాల నిర్వహణ, భక్తుల బస, వాహనాల పార్కింగ్ కోసం విస్తృత స్థలాలను కేటాయిస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు, రద్దీని నియంత్రించేందుకు 268.12 కిలోమీటర్ల మేర పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు.

రవాణా, రైల్వే సేవలు

పుష్కరాల సమయంలో భక్తుల ప్రయాణ సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో 4,000 ప్రత్యేక బస్సులు, పర్యావరణహితంగా ఉండేలా మరో 649 గ్రీన్ బస్సులను నడపనున్నారు. అలాగే రైల్వేశాఖ సహకారంతో 1,560 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో అదనపు ప్లాట్‌ఫారంతో పాటు కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు.

సాంకేతికత వినియోగం -వైద్య సేవలు

పుష్కర ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చే భక్తులకు సులభంగా సమాచారం అందించేందుకు 135 భాషల్లో సేవలందించే ప్రత్యేక ఏఐ చాట్‌బాట్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు. అత్యవసర వైద్య సేవల కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో అదనంగా 100 పడకలను సిద్ధం చేయనున్నారు. ప్రతి ఘాట్ వద్ద వైద్య బృందాలు, అంబులెన్సులు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రాజెక్టులు- పర్యావరణ పరిరక్షణ

సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ఆధునికీకరణ, అభివృద్ధి పనులను 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా నిర్దేశించారు. అలాగే ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టును కూడా పుష్కరాల కంటే ముందే పూర్తి చేసి ప్రారంభించేలా పనులు పరుగులు పెట్టించాలని సూచించారు. భక్తులకు జల రవాణా అనుభూతిని అందించేందుకు రాజమహేంద్రవరం--పోలవరం మధ్య 40 కిలోమీటర్ల పరిధిలో ఆరు ఫ్లోటింగ్ పంటూన్లను ఏర్పాటు చేయనున్నారు. పుష్కరాలను పూర్తి పర్యావరణహితంగా నిర్వహించేందుకు ప్లాస్టిక్ నిషేధం, పకడ్బందీ వ్యర్థాల నిర్వహణ, గోదావరి జలాలు కలుషితం కాకుండా పరిరక్షించడం, సౌర విద్యుత్ వినియోగంపై దృష్టి పెట్టనున్నారు. సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా గోదావరి నదీ హారతి, సామూహిక కూచిపూడి నృత్య ప్రదర్శనలు, భారీ దీపాలంకరణ, గోదావరి ముగ్గుల పోటీలు, సామూహిక యోగా వంటి ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

హైదరాబాద్‌లో నాలుగు హోటళ్ల లైసెన్సులు రద్దు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలోని ప్రముఖ రెస్టారెంట్లలో ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. వినియోగదారుల ఆరోగ్యానికి ముప్పు కలిగించేలా తీవ్ర లోపాలకు పాల్పడిన నాలుగు హోటళ్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను తక్షణమే సస్పెండ్ చేశారు. వీటితో పాటు అనుమతులు లేకుండా నడుస్తున్న ఒక హాస్టల్, బేకరీలను మూసివేయించారు. లైసెన్సులు రద్దయిన వాటిలో మాదాపూర్ అయ్యప్ప సొసైటీలోని 'మాదాపూర్ బావర్చి', కూకట్‌పల్లిలోని 'ది స్పైస్ కిచెన్', టోలిచౌకిలోని 'మతామ్ అల్ యమాని అరేబియన్ రెస్టారెంట్', చందానగర్‌లోని 'అన్నపూర్ణ క్యాటరర్స్' ఉన్నాయి. ఈ నాలుగు సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.ఈ హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో తీవ్రమైన అపరిశుభ్ర పరిస్థితులు వెలుగుచూశాయి. వంటగదుల్లో బొద్దింకలు, ఎలుకల విసర్జితాలు సంచరిస్తున్నట్లు గుర్తించారు. ఫ్రిడ్జ్‌లలో శాకాహారం, మాంసా

తెలంగాణలో బీసీ డిప్యూటీ సీఎం డిమాండ్ !

హైదరాబాద్ : తెలంగాణ మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణపై చర్చలు ఊపందుకున్న వేళ, రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాల్లో బీసీ డిప్యూటీ సీఎం డిమాండ్ ఒక్కసారిగా కాకరేపుతోంది. రాష్ట్ర జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బలహీన వర్గాలకు అధికారంలో సముచిత వాటా కల్పించాలంటూ ఆ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు, మంత్రులు ఏకంగా అగ్రనేత రాహుల్ గాంధీ వద్దే తమ గళాన్ని వినిపించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 15 మంది మంత్రులు ఉండగా, కేబినెట్‌లో ఇంకా రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ విస్తరణలోనే ప్రస్తుత ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు అదనంగా ఒక బీసీ నేతకు డిప్యూటీ సీఎం పీఠం కట్టబెట్టాలనే ప్రతిపాదన పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది.జనాభా ప్రాతిపదికన హక్కులు, అధికారం దక్కాలి .. అంటూ దేశవ్యాప్తంగా కులగణన, సామాజిక న్యాయం నినాదాన్ని భుజానికెత్తుకున్న రాహుల్ గాంధీకి ఇప్పుడు సొంత రాష్ట్రం తెలంగాణలోనే అసలైన పరీక్ష ఎదురైంది. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో బీసీ ఓటర్ల పాత్ర అత్యంత కీలకమైనప్పటికీ, కేబినెట్‌లో ఆ సామాజిక వర్గానికి ఆశించిన స్థాయిలో ప్రాతినిధ్యం దక్కలేదనే అసంతృప్తి మొదటి నుంచీ ఉంది ఇటీవలే పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ భవిష్యత్తులో బీసీ ముఖ్యమంత్రి ఉంటారంటూ చేసిన వ్యాఖ్యలు పార్టీలో కొత్త సమీకరణాలకు తెరలేపాయి. ఇప్పుడు ఏకంగా బీసీ డిప్యూటీ సీఎం పదవి కోసం నేతలు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తుండటంతో, రాహుల్ గాంధీ తన సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని ఇక్కడ ఎంతవరకు అమలు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.అయితే, బీసీ నేతకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వడానికి పార్టీలోని సీనియర్ నేతలు, అగ్రవర్ణ వర్గాలు అంత సులభంగా అంగీకరిస్తాయా అన్నదే అసలు ప్రశ్న. ఇప్పటికే కేబినెట్‌లోని రెండు ఖాళీల కోసం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి,ప్రేమ్‌సాగర్ రావు వంటి సీనియర్ నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు, ఇప్పటికే ఒక డిప్యూటీ సీఎం పదవి ఎస్సీ సామాజిక వర్గం వద్ద ఉండగా, మరో డిప్యూటీ సీఎం పదవిని సృష్టిస్తే అధికార కేంద్రాలు పెరిగి పరిపాలనలో సమన్వయ లోపం తలెత్తుతుందని సీనియర్లలోని ఒక వర్గం వాదిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కేబినెట్ కూర్పులో సామాజిక సమతుల్యతతో పాటు, పార్టీలో తన పట్టు సడలకుండా జాగ్రత్త పడాల్సిన సున్నితమైన పరిస్థితి నెలకొంది.వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండేళ్ల సమయం మాత్రమే ఉన్నందున , డిసెంబర్‌లో జరగనున్నట్లు భావిస్తున్న కేబినెట్ విస్తరణ కాంగ్రెస్ భవిష్యత్తుకు అత్యంత కీలకం కానుంది. ఒకవేళ అధిష్టానం బీసీ డిప్యూటీ సీఎం డిమాండ్‌ను పక్కనపెడితే,రాష్ట్రంలోని మెజారిటీ ఓటు బ్యాంకు అయిన బలహీన వర్గాలు పార్టీకి దూరమయ్యే ప్రమాదం ఉంది. ప్రతిపక్షాలైన బీఆర్ఎస్,బీజేపీలు ఇదే అంశాన్ని ఆయుధంగా చేసుకుని కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే అవకాశం ఉంది. అలాగని డిప్యూటీ సీఎం పదవి ఇస్తే,ఆ పదవి కోసం పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లేదా ఇతర సీనియర్ బీసీ నేతల మధ్య పోటీ నెలకొని అంతర్గత కుమ్ములాటలు బయటపడే ఛాన్స్ ఉంది.మొత్తంగా చూస్తే, తెలంగాణ కాంగ్రెస్‌లో 'బీసీ డిప్యూటీ సీఎం' అంశం ఇప్పుడు అధిష్టానానికి కత్తిమీద సాములా మారింది.కేవలం నినాదాలు, హామీలతోనే సరిపెట్టకుండా 56 శాతం జనాభా ఉన్న బీసీలకు అత్యున్నత పదవి ఇచ్చి రాహుల్ గాంధీ చరిత్ర సృష్టిస్తారా, లేక సీనియర్ల ఒత్తిడికి తలొగ్గి పాత ఫార్ములాతోనే సర్దుబాటు చేస్తారా అన్నది వేచి చూడాలి.

సికింద్రాబాద్ టూ కరీంనగర్‌కు నమో భారత్

కరీంనగర్ : ఉపాధి, విద్య, వ్యాపార అవసరాల కోసం హైదరాబాద్‌లో స్థిరపడిన ఉత్తర తెలంగాణ ప్రజలకు సొంతూళ్లకు రాకపోకలు పెద్ద సమస్యగా మారాయి. ముఖ్యంగా నగర తూర్పు ప్రాంతాలైన ఘట్‌కేసర్, చర్లపల్లి, మౌలాలి, బోడుప్పల్, తార్నాక తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల ప్రజలు స్వస్థలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల్లో ప్రయాణిస్తే అధిక ఛార్జీలు, ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతుండగా.. రైళ్లలో వెళ్లాలంటే గంటల తరబడి సమయం వెచ్చించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ నుంచి పెద్దపల్లి, కాజీపేట మీదుగా కరీంనగర్‌కు నమో భారత్ ర్యాపిడ్ రైలు లేదా మెము రైలు ప్రవేశపెట్టాలనే డిమాండ్ పెరుగుతోంది. ప్రయాణికుల సంఘాల ప్రతినిధులు సైతం ఈ ప్రతిపాదనను ముందుకు తెస్తున్నారు. ఈ మార్గంలో వేగవంతమైన రైలు సేవలు అందుబాటులోకి వస్తే హైదరాబాద్‌లో నివసించే ఉత్తర తెలంగాణ ప్రజలకు ప్రయాణ కష్టాలు గణనీయంగా తగ్గుతాయని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్-కరీంనగర్ మధ్య ప్రయాణానికి ఆర్టీసీ బస్సులే ప్రధాన రవాణా సాధనంగా ఉన్నాయి. ప్రతి ఐదు నిమిషాలకు ఎక్స్‌ప్రెస్, డీలక్స్, రాజధాని, సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రయాణానికి సుమారు నాలుగు గంటలు పడుతోంది. కనీస టికెట్ ధర రూ.220 నుంచి ప్రారంభమవుతుండగా.. లగ్జరీ బస్సుల్లో ఛార్జీలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. పండగలు, వారాంతాల్లో ప్రయాణికుల రద్దీ పెరిగితే బస్సుల్లో సీట్లు దొరకడం కూడా కష్టంగా మారుతోంది. మరోవైపు రైలు ప్రయాణం చౌకగా ఉన్నప్పటికీ ప్రస్తుతం కరీంనగర్ నుంచి కాచిగూడకు నడుస్తున్న డెమూ ప్యాసింజర్ రైలు ప్రయాణికులకు పెద్దగా ఉపయోగపడటం లేదు. ఈ రైలు జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్ మీదుగా సుమారు 309 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్తోంది. దీంతో గమ్యస్థానానికి చేరుకోవడానికి ఎనిమిది నుంచి తొమ్మిది గంటలు పడుతోంది. నిజామాబాద్-మేడ్చల్ మార్గంలో సింగిల్ రైల్వే లైన్ ఉండటం, గరిష్ఠ వేగపరిమితి గంటకు 110 కిలోమీటర్లుగా ఉండటం వల్ల ప్రయాణ సమయం మరింత పెరుగుతోంది. బస్సులో నాలుగు గంటల్లో చేరుకునే దూరానికి రైలులో దాదాపు రెట్టింపు సమయం వెచ్చించాల్సి వస్తోంది.కరీంనగర్ నుంచి పెద్దపల్లి, కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు రైలు నడిపేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. పెద్దపల్లి-కాజీపేట మధ్య మూడో రైల్వే లైన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. కాజీపేట నుంచి ఘట్‌కేసర్ వరకు రెండో లైన్, ఘట్‌కేసర్ నుంచి సికింద్రాబాద్ వరకు నాలుగో రైల్వే మార్గం అందుబాటులో ఉన్నాయి. పెద్దపల్లి నుంచి సికింద్రాబాద్ వరకు రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యం ఉంది. కరీంనగర్-పెద్దపల్లి మధ్య ఉన్న 35 కిలోమీటర్ల సింగిల్ లైన్‌లోనూ గంటకు 110 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడిపే అవకాశం ఉందని ప్రతిపాదకులు పేర్కొంటున్నారు. ఈ మార్గంలో నమో భారత్ ర్యాపిడ్ రైలు లేదా మెము రైలును ప్రవేశపెడితే సికింద్రాబాద్-కరీంనగర్ మధ్య ప్రయాణ సమయాన్ని మూడు నుంచి మూడున్నర గంటల నుంచి నాలుగు గంటలలోపు పరిమితం చేయవచ్చని అంచనా వేస్తున్నారు.కొత్త రైలు అందుబాటులోకి వస్తే సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులకు బస్సులతో పోలిస్తే చౌకైన ప్రయాణ సదుపాయం లభిస్తుంది. ముఖ్యంగా ఉప్పల్, ఘట్‌కేసర్, చర్లపల్లి, మౌలాలి, సికింద్రాబాద్ ప్రాంతాల్లో నివసించే ఉత్తర తెలంగాణ ప్రజలకు తమ నివాస ప్రాంతాలకు సమీపంలోని స్టేషన్ల నుంచే రైలు ఎక్కే అవకాశం ఉంటుంది. దీనివల్ల నగరంలోని రద్దీ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు రోడ్డు ప్రయాణంపై ఆధారపడటం కూడా తగ్గుతుంది. కరీంనగర్, పెద్దపల్లి, కాజీపేట, సికింద్రాబాద్ మధ్య విద్యా, ఉద్యోగ, వ్యాపార సంబంధాలు మరింత బలోపేతమవుతాయి. హైదరాబాద్‌లో పనిచేస్తూ స్వగ్రామాలకు తరచూ వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులకు ఈ రైలు సేవలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. ఇప్పటికే రైల్వే మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని రైల్వే శాఖ నమో భారత్ లేదా మెము రైలు ప్రతిపాదనను పరిశీలించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

జానీ వాకర్ పేరుతో చీప్ లిక్కర్

హైదరాబాద్ : కల్తీకి కాదేది అనర్హం అన్న తీరుగా నకిలీ ఉత్పత్తుల తయారీ గ్యాంగ్స్ చెలరేగిపోతున్నాయి. నీళ్ల కల్తీ, పాలు కల్తీ, టీపొడి, షాంపులు, పేస్టులు, ఆఖరికి బియ్యం సైతం ప్లాస్టిక్ రూపంలో మార్కెట్లోకి తీసుకువచ్చి మోసం చేస్తున్నారు. ఆఖరికి సంతోషంలోనో, బాధాలోనే తాగే మందు సైతం కల్తీ చేసేస్తున్నారు. ఖరీదైన బ్రాండ్స్, ఫారిన్ స్కాచ్ తాగుతున్నాం, కిక్కే వేరప్పా అనుకుంటూ వేలకు వేలు పోసి మరీ ప్రీమియం లిక్కర్ కొంటున్న మందుబాబులకు కల్తీ గ్యాంగ్ షాక్ ఇచ్చింది. ఆ లిక్కర్ బాటిల్స్ విదేశీ బ్రాండ్ స్కాచ్, విస్కీలు కాదని, పక్కా లోకల్ చీప్ లిక్కర్ అని పోలీసులు స్పష్టం చేశారు. హైదరాబాద్ శివారు శంషాబాద్ కేంద్రంగా సాగుతున్న కల్తీ స్కాచ్ దందా గుట్టును రట్టు చేశారు. గతంలో డిస్టిలరీలో పనిచేసిన అనుభవం ఉన్న వంగలి అశోక్ అనే వ్యక్తి, తన అతి తెలివితేటలతో కల్తీ లిక్కర్ మందు విక్రయిస్తూ మందుబాబుల జేబులకు చిల్లు పెట్టాడు. అశోక్ ముందుగా శంషాబాద్‌కు చెందిన పాత సామాన్లు కొనుగోలు చేసి విక్రయించే మహమ్మద్ యాకూబ్ పాషా సాయంతో, ఫంక్షన్లు, పబ్బుల్లో వాడి పడేసిన ఖాళీ జానీ వాకర్, 100 పైపర్స్, డ్యూయర్స్ వంటి ఖరీదైన విదేశీ బ్రాండ్ బాటిళ్లను సేకరిస్తాడు. ఆ తర్వాత అశోక్ తన ఇంటినే ఒక మినీ డిస్టిలరీలా మార్చిపడేశాడు. కేవలం 500, 600 రూపాయలు ఉండే డౌన్ టౌన్ లోకల్ లిక్కర్ తెచ్చి, దాన్ని ఆ ప్రీమియం బాటిళ్లలో నింపి, అసలు సీల్ ఏమాత్రం చెదరకుండా పక్కాగా ప్యాక్ చేసేవాడు. ఆ తర్వాత ఆ ప్రీమియం లిక్కర్ బాటిల్స్ స్థానికంగా ఉండే కస్టమర్లకు డిస్కౌంట్లు ప్రకటిస్తూ వేల రూపాయలకు విక్రయిస్తూ జేబులు నింపుకున్నాడని పోలీసులు గుర్తించారు.ఈ నకిలీ స్కాచ్ లిక్కర్ దందాపై పక్కా సమాచారం అందుకున్న పోలీసులు అశోక్ ఇంటిపై మెరుపు దాడి చేశారు. ఇంట్లో కల్తీ మందు నింపిన 10 ప్రీమియం బాటిళ్లతో పాటు, రీఫిల్లింగ్ కోసం సిద్ధంగా ఉంచిన 30కి పైగా ఖాళీ ఫారిన్ బ్రాండ్ సీసాలను చూసి షాకయ్యారు. లిక్కర్ బాటిళ్లతో పాటు ఖాళీ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు అశోక్, యాకూబ్ పాషాలను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.ఇప్పటివరకు ఈ కల్తీ స్కాచ్‌ను కొనుగోలు చేసి స్థానిక కస్టమర్ల వివరాలను కూడా ఎక్సైజ్ అధికారులు, పోలీసులు ఆరా తీస్తున్నారు. ఫారిన్ బ్రాండ్ స్కాచ్, విస్కీ అని బిల్డప్ ఇస్తూ పార్టీలు చేసుకునే మందుబాబులు తాము చివరికి చీప్ లిక్కర్ తాగామా అంటూ ఆశ్చర్యపోతున్నారు.

పొల్ట్రీ దిగ్గజం స్నేహ ఫామ్స్‌కు ఐటీ షాక్

హైదరాబాద్ : ప్రముఖ పౌల్ట్రీ, అగ్రి బిజినెస్ సంస్థ స్నేహ గ్రూప్ పై ఆదాయపు పన్ను శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో ఆకస్మికంగా సోదాలు చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ సహా పలు చోట్ల ఉన్న సంస్థ కార్యాలయాలతో పాటు హైదరాబాద్ కొండాపూర్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్నేహ గ్రూప్ డైరెక్టర్లు రామ్ రెడ్డి దెండి, వరుణ్ రెడ్డి దెండి , స్నేహ దెండి నివాసాల్లో ఐటీ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.1982లో 'రామ్ రెడ్డి చికెన్ మార్కెట్'గా ప్రారంభమైన ఈ సంస్థ, 1994లో స్నేహ ఫామ్స్ గా విస్తరించి అంచెలంచెలుగా ఎదిగింది. ప్రస్తుతం ఈ గ్రూప్ పౌల్ట్రీ బ్రీడింగ్, చికెన్ ప్రాసెసింగ్, పశువుల దాణా, సఫల బ్రాండ్ పేరుతో వంట నూనెల తయారీ రంగాల్లో వ్యాపారాలు నిర్వహిస్తోంది. తెలంగాణలో గంటకు 12,000 కోళ్లను ప్రాసెస్ చేసే సామర్థ్యం గల అత్యాధునిక ఆటోమేటెడ్ ప్లాంట్‌ను ఈ సంస్థ నిర్వహిస్తోందని తెలిసిందే. 2,000 మందికి పైగా కాంట్రాక్ట్ రైతులతో కలిసి వ్యాపారం చేస్తున్న స్నేహ గ్రూప్, భారత రక్షణ సంస్థలకు (డిఫెన్స్) సైతం ఫ్రోజెన్ చికెన్ సరఫరా చేస్తోంది. అంతేకాకుండా, 2024 ఆర్థిక సంవత్సరంలో సింగ్ పౌల్ట్రీని కొనుగోలు చేసిన ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్‌కు చెందిన దిగ్గజ కంపెనీ మిట్సుయి ఉ కో కూడా ఆసక్తి చూపింది. సంస్థ లావాదేవీలు, లెక్కల్లో అవకతవకలు ఉన్నాయన్న సమాచారంతో ఐటీ శాఖ రంగంలోకి దిగి ఆకస్మిక తనిఖీలు చేపట్టింది.

ఓవైసీ వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నేతల ఆందోళన

సికింద్రాబాద్ టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమపై ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా రసూల్ పురా కూడలి వద్ద కాంగ్రెస్ నేతలు ఆందోళనకు దిగారు. అసదుద్దీన్ ఓవైసీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రహదారిపై బైఠాయించి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రహదారిపై పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు నిరసనకు దిగి ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఉన్న ప్లకార్డులను కాల్చివేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ టీపీసీసీ ఉపాధ్యక్షురాలు గా ఉన్న కోట నీలిమ పట్ల అనుచితంగా మాట్లాడడం ఓవైసీకి తగదని అన్నారు. మహిళా నాయకురాలిపై ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. దమ్ముంటే రాజకీయంగా సిద్ధాంత పరంగా విమర్శించాలి తప్ప వ్యక్తిగత విమర్శలకు రాజకీయాలలో తావు లేదని, వెంటనే ఆమెకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఓవైసీని డిమాండ్ చేశారు. రాజకీయ నేపథ్యం ఉన్న కోట నీలిమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ఓవైసీ నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.

ఇబ్రహీంపట్నంలో కలకలం..

- గాంధీనగర్ కాలనీలో మనిషి పుర్రె లభ్యం

- మంగళవారం కాలు.. నేడు పుర్రె..

- వరుసగా బయటపడుతున్న మానవ అవశేషాలతో స్థానికుల్లో ఆందోళన.



రంగారెడ్డి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో మనిషి పుర్రె లభ్యం కావడం స్థానికంగా కలకలం రేపింది. ఇటీవల ఇదే ప్రాంతంలో మనిషి కాలు బయటపడగా, తాజాగా పుర్రె లభ్యం కావడంతో ఈ ఘటన మరింత చర్చనీయాంశంగా మారింది.వరుసగా మానవ అవశేషాలు బయటపడుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పుర్రెను పరిశీలించారు. అవశేషాలు ఎవరివి? అక్కడికి ఎలా వచ్చాయి? అనే కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.ఇటీవల లభించిన కాలు, తాజాగా బయటపడిన పుర్రె ఒకే వ్యక్తికి సంబంధించినవా? లేక వేర్వేరు ఘటనలకు సంబంధించాయా? అనే విషయాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. పుర్రె లభ్యమైన ప్రాంతాన్ని పరిశీలిస్తూ పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.వరుసగా మానవ అవశేషాలు బయటపడటంతో గాంధీనగర్ కాలనీ పరిసరాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. పోలీసుల దర్యాప్తులో మరిన్ని వివరాలు వెల్లడికానున్నాయి.

సిద్ధిపేట ఒకప్పుడు ఎట్లా ఉండే ఇప్పుడు ఎట్లా ఉంది

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి

హరీష్ రావు హయంలో సిద్ధిపేట అభివృద్ధి చేందిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి కితాబునిచ్చారు. పలు విద్యా సంస్థలు వచ్చాయని గుర్తు చేసారు. హరీష్ రావు, కేసీఆర్ అడుగులో అడుగు వేస్తూ ఉద్యమంలో భాగమై తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ గారి వెంబడి ఉండి రాష్ట్ర ఏర్పాటుకు తోడు అందించి రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకున్న వ్యక్తి అని అన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడు హరీష్ రావు బిజెపి పార్టీతో టచ్ లో ఉన్నాడు. వెళ్లడం లేదంటే గుడిలో ఒట్టు పెట్టుకోవాలని అంటున్నాడు. టిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి, ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టడానికి హరీష్ రావు ఎంతో కష్టపడుతున్నాడు. హరీష్ రావు ఒట్టు పెట్టుకోవడం కాదు ముందు రేవంత్ రెడ్డి నువ్వు చంద్రబాబు నాయుడు దర్శకత్వంలో ఆయన సూచనల మేరకు పనిచేస్తున్నవా లేదా నువ్వు మొదలు ఓట్టు పెట్టుకో అని అన్నారు.


అమెరికాలో రోడ్డు ప్రమాదం..

- నల్గొండ యువకుడి మృతి



నల్గొండ నల్గొండ జిల్లా మునుగోడుకు చెందిన సాయితేజ(25) ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి, వారం క్రితమే ఉద్యోగం సంపాదించాడు. కారులో వెళ్తుండగా ఓ జింక అడ్డు రావడంతో దాన్ని ఢీకొట్టి కారు ఆగిపోయింది. అదే సమయంలో వెనక నుంచి వచ్చిన వాహ నాలు అతడి కారును గుద్దాయి. తీవ్రంగా గాయపడిన సాయితేజను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు చెప్పారు. దీంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

లోకేష్ సూచనలతో స్పందించిన అధికారులు



తిరుపతి రైల్వేకోడూరులోని బాలికల పాఠశాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మంత్రి లోకేష్ గుర్తించారు. వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తిరుపతి కలెక్టర్‌ను కోరారు. లోకేష్ ట్వీట్‌పై స్పందించిన జిల్లా యంత్రాంగం తక్షణమే చర్యలు చేపట్టి, పాఠశాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించింది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

శ్రీవారి ఆలయంలో వైభవంగా కైశిక ద్వాదశి ఆస్థానం



తిరుమల : కైశిక ద్వాదశి పర్వదినం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం కైశిక ద్వాదశి ఆస్థానం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా వేకువ ఝామున 4.30 నుంచి 5.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తి ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారు. అనంతరం స్వామి, అమ్మవార్లను బంగారువాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ సాధికారిక మండలి చైర్మన్, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, జేఈవో డాక్టర్ శరత్, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పంచాయితీ పోరుకు సర్పంచ్ అభ్యర్థులు పోటాపోటి

అరకులోయ రాష్ట్రంలో తుది మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది.గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేశారు. స్థానిక సంస్థ గత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా అరకు వేలి మండల పరిధి పంచాయతీల్లో ఎన్నికల వేడి మొదలైంది.మండలంలోని శిరగం పంచాయతీ లో (ఆశావాహులు)సర్పంచ్ అభ్యర్థులు నువ్వా నేనా అంటూ సమరానికి సిద్దమవుతున్నారు.పంచాయతి లో 9 మంది ఆశావాహులు సర్పంచ్ పోటీ కు పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.సర్పంచ్ పదవి ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ అటూ ఆశావాహుల్లో ఇటు పంచాయతీ ప్రజల్లో నెలకొంది.ఎవరికి వారు గట్టి పోటీ ఇస్తున్నారని తెలుస్తోంది.ఇప్పట్నుంచే తమ వ్యూహాలకు పదును పెడుతు రహస్యం గా సమావేశాలు , మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం.కొందరు ఆశావాహులు పార్టీ నాయకులు కార్యకర్తల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటే మరి కొందరు తమ సొంత ఎజెండా ను నమ్ముకొని బరిలోకి దిగుతున్నారు.అలాగే పెద్దల సహకారం ముఖ్యంగా యువతపై ప్రత్యేక దృష్టి పెడుతు మద్దతు కావాలని అభ్యర్థిస్తున్నారు.గెలుపే లక్ష్యంగా చేసుకొని ప్రజల మద్దతును కూడగట్టేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పంచాయతీలో 14 గ్రామాలు ఉన్నాయి,ఏ గ్రామం ఎవరి వైపు మద్దతు ఇస్తుందో సర్పంచ్ పదవి ఎవరికి వరిస్తుందో ఆసక్తికరంగా మారింది.మమ్మల్ని ఒక్క అవకాశం ఇవ్వండి మీకు అందుబాటులో ఉంటూ పంచాయతీ ను అభివృద్ధి చేస్తామని హామీలు ఇస్తున్నారు.మీకు ఏ సమస్య ఉన్న పరిష్కారం చూపుతామంటు భరోసా ఇస్తున్నారు.సర్పంచ్ పదవి అంటే అలంకరణ కాదు ఒక బాధ్యత కలిగిన ప్రజల సేవకుడుగ మీ సమస్యల్ని పరిష్కరించడానికి ఎప్పుడూ ముందుంటామని చెప్పకనే చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో గ్రామంలో మాత్రం వాతావరణ భిన్నంగా ఉంది.ప్రధానంగా సర్పంచ్ పదవులకు పోటీ పడుతున్నవారు ఇప్పటి నుంచే తమ సొంత ఎజెండా ను ముందుకు తెస్తున్నారు.అన్ని సామాజిక వర్గాలను కలుస్తున్నారు.పార్టీలకు అతీతంగా గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచ్ గా ఎంపిక అయితే అందరితో కలిసి పని చేస్తారని హామీలు ఇస్తున్నారు.ఎన్నికల్లో పార్టీ కన్నా సర్పంచ్ పదవే మిన్నగా భావిస్తూ పోటీపడుతున్నారు.ఇవన్నీ జరగాలంటే డిసెంబర్ 2 వ వరకు ఆగాల్సిందే సర్పంచ్ పదవి ఎవరికి వరిస్తుందో వేచి చూడాలి.

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం

సి. బెళగల్, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా సి. బెళగల్ మండల కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా నిర్వహించేందుకు అవసరమైన అంశాలపై సంబంధిత అధికారులకు అవగాహన కల్పించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ రాణెమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి పాల్గొన్నారు. మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ (ఎంఓటీలు) రామాంజినేయులు, ధనుంజయ, రంగన్న శిక్షణ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ప్రిసైడింగ్ అధికారులు పాటించాల్సిన విధివిధానాలు, పోలింగ్ ప్రక్రియ, ఎన్నికల నియమ నిబంధనలు, విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని, ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని శిక్షకులు సూచించారు.

ఆట పెర్‌ఫెక్ట్‌గా ఆడుతున్నాం మళ్లీ గోల్ కొడతాం

శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన పునాది భద్రత విషయంలో శాస్త్రీయ ప్రమాణాలను పక్కనపెట్టి, డీపీఆర్‌లో పేర్కొన్న నిర్మాణ విధానానికి భిన్నంగా సీకెంట్ పైల్ విధానాన్ని ఎందుకు ఎంచుకున్నారో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం తనను కలిసిన కొంతమంది మీడియా మిత్రులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్

పల్స్ పోలియోకు అన్ని ఏర్పాట్లు పూర్తి

0-5 ఏళ్ల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి

డీఎం&హెచ్ఓ డా. పుట్ల శ్రీనివాస్



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) నవంబర్ 22 నాడు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ తెలిపారు. 0-5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని ఆయన పిలుపునిచ్చారు.శుక్రవారం నాంపల్లి క్లస్టర్ పరిధిలోని అఘాపుర పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డా. శ్రీనివాస్ సందర్శించారు. సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డా. మురళీధర్ తో కలిసి కేంద్రంలోని హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, లాబొరేటరీ కేంద్రం, వివిధ రికార్డులు, పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు.

గర్భిణీలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ..

గర్భిణీ స్త్రీలు, పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎం&హెచ్ఓ సూచించారు. గర్భిణీలకు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు, చికిత్స క్రమం తప్పకుండా చేయాలని, గర్భిణీల సంరక్షణ, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు.వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమీక్షించిన ఆయన, 100% టీకాల లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలని కోరారు. అన్ని వ్యాక్సిన్ల కేంద్రంలో నిల్వ ఉంచుకోవాలని, వ్యాక్సిన్ల శీతలీకరణను సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

ఎన్సీడీ సర్వే రోజూ చేయాలి..

నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ సర్వే, స్క్రీనింగ్, ఫాలో అప్ ప్రతిరోజూ చేసి సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలని చెప్పారు. దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు అవసరమైన అన్ని రకాల మందులు అందించాలని, అన్ని మందులను యూపీహెచ్‌సీల్లో, బస్తీ దవాఖానాల్లో నిల్వ ఉంచుకోవాలని సూచించారు. అర్హులైన బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ త్వరితగతిన ఇప్పించి 100% లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. మలేరియా, డెంగీ, చికున్‌గునియా నివారణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలు సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

సమయపాలన తప్పనిసరి..

వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి, కేంద్రంలో అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డా. శ్రీనివాస్ సూచించారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను రోజువారీ ప్రణాళికతో 100% పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని ఆదేశించారు.

రన్నింగ్‌తో కాళ్ల కండరాలు పెరుగుతాయా?

కొవ్వు మాత్రమే తగ్గుతుందా?



ప్రతిరోజూ రన్నింగ్ చేయడం వల్ల కాళ్ల కండరాలు చురుగ్గా పనిచేస్తాయి. ముఖ్యంగా తొడలు, పిరుదులు, పిక్కల కండరాలకు వ్యాయామం లభిస్తుంది. అయితే రన్నింగ్ ఒక్కటే చేస్తే కండరాల పరిమాణం గణనీయంగా పెరగదు. రన్నింగ్ విధానం, వేగం, వ్యాయామ తీవ్రత, ఆహారం, విశ్రాంతిపై ఫలితాలు ఆధారపడి ఉంటాయి. కండరాల పరిమాణాన్ని పెంచుకోవాలంటే బరువులతో చేసే వ్యాయామాలు కూడా అవసరం. రన్నింగ్ చేస్తే ఏం జరుగుతుంది..?: బరువు తగ్గడం, క్యాలరీలు ఖర్చు చేయడం, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడం కోసం చాలామంది ప్రతిరోజూ రన్నింగ్ చేస్తుంటారు. అయితే రన్నింగ్ సమయంలో క్వాడ్రిసెప్స్ (తొడ ముందు భాగం), హ్యామ్‌స్ట్రింగ్స్ (తొడ వెనుక భాగం), గ్లూట్స్ (పిరుదుల కండరాలు), కాఫ్ మజిల్స్ (పిక్కల కండరాలు) చురుగ్గా పనిచేస్తాయి. ముఖ్యంగా కొత్తగా రన్నింగ్ ప్రారంభించినవారిలో కొంత కండరాల అభివృద్ధి కనిపిస్తుంది. సాధారణ జాగింగ్‌తో కండరాల ఓర్పు పెరుగుతుంది. గతంలో కొద్దిదూరం పరిగెత్తడానికే అలసిపోయేవారు, క్రమంగా ఎక్కువ దూరం పరిగెత్తగలుగుతారు. అయితే కండరాల పరిమాణం గణనీయంగా పెరగాలంటే స్క్వాట్స్, స్ప్లిట్ స్క్వాట్స్, కాఫ్ రైజెస్, హ్యామ్‌స్ట్రింగ్ కర్ల్స్ వంటి బలవర్ధక వ్యాయామాలు అవసరం. 2022లో 43 అధ్యయనాలపై నిర్వహించిన సమీక్ష ప్రకారం, ఏరోబిక్ వ్యాయామంతోపాటు రెసిస్టెన్స్ ట్రైనింగ్ చేయడం వల్ల కండరాల పరిమాణం, గరిష్ఠ బలంలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వెల్లడైంది.స్ప్రింటింగ్ ఎంతో మేలు..: సాధారణంగా లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్‌తో పోలిస్తే స్ప్రింటింగ్ (అతి వేగంగా పరిగెత్తడం) కండరాలపై ఎక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది. స్ప్రింటింగ్ సమయంలో గ్లూట్స్, హ్యామ్‌స్ట్రింగ్స్, కాఫ్ మజిల్స్ అధిక శక్తితో పనిచేస్తాయి. అందువల్ల కండరాల అభివృద్ధికి కొంత ఎక్కువ ప్రేరణ లభిస్తుంది. మరోవైపు ఎక్కువ దూరం పరిగెత్తడం వల్ల కండరాల ఓర్పు, గుండె సామర్థ్యం మెరుగుపడతాయి. స్ప్రింటర్లు సాధారణంగా లాంగ్ డిస్టెన్స్ రన్నర్లతో పోలిస్తే ఎక్కువ కండరాలతో కనిపించడానికి ఇదొక కారణం. అయితే జన్యుపరమైన లక్షణాలు, బరువులతో చేసే వ్యాయామాలు, పోషకాహారం కూడా దీనిపై ప్రభావం చూపుతాయి. రన్నింగ్ వల్ల శరీరంలో క్యాలరీల ఖర్చు పెరిగి కొవ్వు తగ్గడానికి సహాయపడుతుంది. సరైన ఆహార నియమాలు పాటిస్తే తొడలు, కాళ్ల చుట్టూ ఉన్న కొవ్వు కూడా తగ్గుతుంది. అయితే శరీరంలోని ఒక నిర్దిష్ట భాగంలో మాత్రమే కొవ్వును తగ్గించడం సాధ్యం కాదు. కొవ్వు తగ్గినప్పుడు ఇప్పటికే ఉన్న కండరాలు మరింత స్పష్టంగా కనిపించి కాళ్లు సన్నగా, దృఢంగా కనిపిస్తాయి. ఏయే కండరాలు పనిచేస్తాయి..: రన్నింగ్ సమయంలో గ్యాస్ట్రోక్నీమియస్, సోలియస్ అనే పిక్కలలోని రెండు ప్రధాన కండరాలు పనిచేస్తాయి. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో పరిగెత్తడం, ఎత్తుకు పరుగెత్తడం, స్ప్రింటింగ్ చేయడం వల్ల వీటిపై ఒత్తిడి పెరుగుతుంది. అయినప్పటికీ పిక్కల కండరాలు ఎంత పెరుగుతాయనేది వ్యాయామ తీవ్రత, క్రమంగా పెంచే బరువు, జన్యుపరమైన లక్షణాలు, విశ్రాంతిపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు అతిగా రన్నింగ్ చేయడం, తగినంత క్యాలరీలు, ప్రోటీన్ తీసుకోకపోవడం వల్ల కండరాల అభివృద్ధికి ఆటంకం కలుగుతుంది. కండరాలను కాపాడుకోవడానికి తగినంత ఆహారం, ప్రోటీన్, నిద్ర, విశ్రాంతి అవసరం. 2024లో 23 మంది పురుష కాలేజీ స్ప్రింటర్లపై ఎంఆర్ఐ ద్వారా ఏడాది పాటు నిర్వహించిన అధ్యయనంలో హ్యామ్‌స్ట్రింగ్స్ సహా కొన్ని కండరాలు పెరిగినట్లు గుర్తించారు. అయితే వారు వెయిట్ ట్రైనింగ్, జంప్ ట్రైనింగ్ కూడా చేయడంతో కండరాల పెరుగుదలలో స్ప్రింటింగ్ పాత్రను మాత్రమే ప్రత్యేకంగా నిర్ధారించలేకపోయారు. కాబట్టి కాళ్లు బలంగా, కండరాలతో దృఢంగా ఉండాలనుకునేవారు వారానికి రెండు నుంచి మూడు రోజులు స్ప్రింట్స్, రొమేనియన్ డెడ్‌లిఫ్ట్స్, లంజెస్, లెగ్ ప్రెస్, కాఫ్ రైజెస్, హిప్ థ్రస్ట్స్ వంటి వ్యాయామాలు చేస్తూ, మితమైన స్థాయిలో రన్నింగ్‌ను కొనసాగించడం మంచిది. సరైన పోషకాహారం, ప్రోటీన్, నిద్రకు ప్రాధాన్యత ఇవ్వాలి. గుండె

జర్నలిస్టుల సమస్యలపై జాప్ గళం

ఇళ్ల స్థలాల కేటాయింపునకు తీర్మానం

-అక్రిడేషన్ ఉన్న ప్రతి జర్నలిస్టుకూ ఇంటి స్థలం ఇవ్వాలి

-కలెక్టర్, ఎస్పీ అధ్యక్షతన మూడు నెలలకోసారి సమీక్షా సమావేశాలు నిర్వహించాలి

- రాజేంద్రప్రసాద్ మృతికి జాప్ గుంటూరు జిల్లా సమావేశం సంతాపం



గుంటూరు(ప్రశ్న న్యూస్) జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపాలని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) గుంటూరు జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. అక్రిడేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుకూ ఇళ్ల స్థలాలు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. జర్నలిస్టుల సమస్యలపై జిల్లా కలెక్టర్, ఎస్పీ అధ్యక్షతన ప్రతి రెండు లేదా మూడు నెలలకు ఒకసారి ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించాలని కోరింది. శనివారం గుంటూరు బ్రాడీపేటలోని 2/6 యూటీఎఫ్ హాలులో జాప్ గుంటూరు జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కాళ్ల లోకేష్..ఫోర్ సైడ్స్ టీవీ ప్రతినిధి, జాప్ రాష్ట్ర నాయకుడు తోట రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

రాజేంద్రప్రసాద్ మృతికి ఘన నివాళి..

సమావేశం ప్రారంభంలో ఇటీవల గుండెపోటుతో అకాల మరణం చెందిన జాప్ సభ్యుడు రాజేంద్రప్రసాద్‌కు సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

అక్రిడేషన్ ఉంటే.. ఇంటి స్థలం ఇవ్వాల్సిందే..

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కాళ్ల లోకేష్ మాట్లాడుతూ జర్నలిస్టులు వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ నిరంతరం విధులు నిర్వహించే జర్నలిస్టులకు కనీస భద్రత, సంక్షేమ సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అక్రిడేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుకూ ఇళ్ల స్థలాలు కేటాయించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించి, అర్హులైన వారికి న్యాయం చేయాలని సమావేశం తీర్మానించింది.

మూడు నెలలకోసారి సమస్యలపై సమీక్ష..

జర్నలిస్టుల సమస్యలు ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి వెళ్లి పరిష్కారమయ్యేలా జిల్లా స్థాయిలో ప్రత్యేక వ్యవస్థ ఉండాలని సమావేశం అభిప్రాయపడింది. జిల్లా కలెక్టర్, ఎస్పీ అధ్యక్షతన రెండు లేదా మూడు నెలలకు ఒకసారి సమీక్షా సమావేశాలు నిర్వహించాలని కోరింది. అక్రిడేషన్, ఇళ్ల స్థలాలు, జర్నలిస్టుల భద్రత, సంక్షేమం తదితర అంశాలపై ఈ సమావేశాల్లో చర్చించి పరిష్కార మార్గాలు చూపాలని విజ్ఞప్తి చేసింది.

విజయవాడ బైపాస్‌లోకి రెండు రోజులు వాహనాలకు నో ఎంట్రీ

- విజయవాడ బైపాస్‌పై వాహనాలకు నో ఎంట్రీ

- రెండు రోజుల పాటూ నిబంధనలు ఉంటాయి

- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంట్రీ లేదు



విజయవాడ : విజయవాడ బైపాస్ మీదుగా ప్రయాణించే వాహనదారులకు ముఖ్యమైన గమనిక. విజయవాడ బైపాస్‌లో శని, ఆదివారాల్లో వాహనాలకు అనుమతి లేదు.. ఈ రెండు రోజుల పాటూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వాహనాల రాకపోకలు నిలిపివేశారు. విజయవాడ బైపాస్‌లో రూరల్ పరిధిలో అంబాపురం హైటెన్షన్ విద్యుత్తు టవర్ల మార్చే పనులు చేపట్టారు. అందుకే వాహనాలను బైపాస్‌లోకి అనుమతించడం లేదన్నారు. రెండురోజుల పాటు వాహనదారులను ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచించారు. విజయవాడ బైపాస్‌లో ఆయా వేళలు (ఉదయ 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు) తప్ప మిగిలిన సమయాల్లో వాహనాలు యథావిధిగా బైపాస్ నుంచి రాకపోకలు సాగించవచ్చు.ఏలూరు వైపు నుంచి విజయవాడ బైపాస్ ద్వారా హైదరాబాద్, గుంటూరు వైపు వెళ్లే వాహనాలు.. చినఅవుటపల్లి నుంచి రామవరప్పాడు, బెంజ్‌సర్కిల్ దాకా వెళ్లాలి. అక్కడి నుంచి గుంటూరు వెళ్లేవారు వారధి మీదుగా, హైదరాబాద్ వెళ్లేవారు బస్టాండ్ మీదుగా వెళ్లాలని సూచిస్తున్నారు. గుంటూరు, హైదరాబాద్ వైపు నుంచి వాహనాలు ఏలూరు వైపు వెళ్లేందుకు గొల్లపూడి నల్లకుంట రింగు నుంచి గొల్లపూడి వైజంక్షన్, సీవీఆర్ పైవంతెన, పైపుల రోడ్డు, నున్న పవర్‌గ్రిడ్ మీదుగా విజయవాడ బైపాస్‌కు వెళ్లాలని సూచించారు. మైలవరం నుంచి విజయవాడ వైపు వచ్చే వాహనదారులు పామూలకాలువ సెంటర్ నుంచి అంబాపురం, పి.నైనవరం, పామూలకాలువ మీదుగా వై.వి.ఎస్టేట్ మీదుగా వెళ్లాలి. విజయవాడ వైపు నుంచి మైలవరం వైపు వెళ్లే వాహనాలు వై.వి.రావు ఎస్టేట్ నుంచి పామూల కాలువ, షాబాద్ అండర్‌పాస్ నుంచి కొత్తూరు తాడేపల్లి రోడ్డు మీదుగా వెళ్లాలి. వాహనదారులు ఈ మార్పులు గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు ఆదేశాల మేరకు, విజయవాడ బెంజ్ సర్కిల్ దగ్గర ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అస్త్రం యాప్ ద్వారా ప్రయాణికుల నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా ఆటో డ్రైవర్లను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇతర ఆటో డ్రైవర్లకు సూచించారు. అస్త్రం యాప్ ద్వారా అందే ఫిర్యాదులను ట్రాఫిక్ పోలీసులు పరిశీలించి, అనుచిత ప్రవర్తనపై తగిన చర్యలు తీసుకుంటారు.

పరుగుల రాణికి బంగారు పతకం



కమాన్ పూర్ నవంబర్ 21. కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి ఆనందికి బంగారు పతకం లభించింది. మధ్యప్రదేశ శివపురి లో జరిగిన 70వ ఎస్ జి ఎఫ్ ఛాంపియన్ షిప్ జాతీయస్థాయి 17 సంవత్సరాల విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి భారతి శంకర్ ల ద్వితీయ పుత్రిక నల్లవెల్లి ఆనంది 55 :89సెకండ్లు పూర్తి చేసి బంగారు పతకం సాధించిది. నల్లవెల్లి ఆనంది గతంలో జాతీయ మెడల్స్ సాధించిన విషయం తెలిసినది ఆనంది కమాన్ పూర్ మండలం గుండారంలోని జూనియర్ కళాశాలలో సిఇసి రెండవ సంవత్సరం చదువుతున్నది.

చదువుల్లో సైతం ఇంటర్ మొదటి సంవత్సరంలో ర్యాంకులు సాధించింది. పట్టుదలతో అనేక పతకం లు సాధించిన ఆనందిని మళ్లీ జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని కోచ్ సుబ్బారావు రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రెటరీ సారంగపాణి ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెంకటేశ్వర రెడ్డి పేర్కొన్నారు.జిల్లా ఎస్జీఎఫ్ సెక్రెటరీ లక్ష్మణ్ డి ఎస్ వై ఓ సురేష్ పెద్దపల్లి కలెక్టర్ ఆఫీస్ ఏవో బండి ప్రకాష్ ప్రకాష్ రిటైర్డ్ డి.ఎస్.పి బెల్లంకొండ నర్సింగరావు అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రెటరీ కొమ్ము గట్టయ్య జూనియర్ కాలేజ్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ రమేష్ సింగల్ విండో చైర్మన్ ఇసగంటి భాస్కరరావు కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్య నారాయణ గౌడ్, రత్నాపూర్ సర్పంచి పల్లె ప్రతిమా పివి రావు, మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి, లైన్స్ క్లబ్ కమాన్ పూర్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి, మత్తకార సొసైటీ అధ్యక్షులుగడప కృష్ణమూర్తి, మాజీ ఎంపిటిసిలు పిల్లి చంద్రశేఖర్, కోలేటి చంద్రశేఖర్, డాక్టర్ విజయకుమార్, లైన్స్ క్లబ్ సభ్యులు జబ్బార్ ఖాన్ ఆనందికి అభినందనలు తెలిపినారు

ఇందిరమ్మ కుటుంబ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

– పెంచికల్ పేట గ్రామ సర్పంచ్ పల్లె మాధవి నారాయణ



కమాన్ పూర్ నిరుపేద ప్రజలకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ బీమాను సద్వినియోగం చేసుకోవాలని పెంచికల్ పేట గ్రామ సర్పంచ్ పల్లె మాధవి నారాయణ పిలుపునిచ్చారు. కమాన్ పూర్ మండలం పెంచికల్ పేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ఆమే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ.. నిరుపేద ప్రజలకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, కుటుంబ పెద్ద చనిపోతే వారి కుటుంబానికి అండగా నిలిచేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరు ఈ పథకంలో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారితో ఉపసర్పంచ్ చొప్పరి శేఖర్ ,గ్రామ వార్డు సభ్యులు , పంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువులు

విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

- ఎస్పీ మహేష్ బి. గితే

- తరచూ నకిలీ విత్తనాల కేసుల్లో పట్టుబడితే పీడీ యాక్ట్ అమలు



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) జిల్లాలో నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువుల విక్రయాలు, అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్, వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. జిల్లాలో నకిలీ విత్తనాలను విక్రయించినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, తరచూ ఇటువంటి కేసుల్లో పట్టుబడే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. శనివారం రోజున పోలీస్ , వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, లైసెన్సులు, ఎరువులు, విత్తనాల నిల్వలు, బిల్లులు, రసీదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాల అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో నకిలీ విత్తనాల విక్రయాలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఒక్క రైతు కూడా నకిలీ విత్తనాలతో మోసపోకుండా చూడాల్సిన బాధ్యత పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులపై ఉందని, జిల్లాలోని ఫర్టిలైజర్, సీడ్స్ షాపులపై నిరంతరం నిఘా ఉంచి నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువుల విక్రయాలు, అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషి చేస్తున్నన్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, నాణ్యతపై అనుమానం ఉన్నా లేదా ఎవరైనా నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా ప్రజలకు, రైతులకు సూచించారు. రైతులను నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువుల బారి నుంచి రక్షించేందుకు జిల్లా పోలీస్, వ్యవసాయ శాఖ సమన్వయంతో నిరంతరం తనిఖీలు కొనసాగిస్తాయని తెలిపారు. ఈతనిఖీల్లో పోలీస్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

భక్తి జ్యోతుల వెలుగులో..
సిబ్బంది సేవలకు ప్రశంసల జల్లు

- శ్రీశైలంలో వైభవంగా కోటిదీపోత్సవం, సమష్టి కృషికి అభినందనలు

- ప్రతి విభాగం అంకితభావంతో పనిచేసింది: ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు

శ్రీశైలం(ప్రశ్న న్యూస్) జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలంలో కార్తీకమాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన కోటిదీపోత్సవం భక్తిభావాన్ని వెల్లివిరిసేలా చేసింది. లక్షలాది దీపాల వెలుగులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న ఈ మహోత్సవం విజయవంతం కావడానికి తెరవెనుక పనిచేసిన దేవస్థానం సిబ్బంది సేవలకు ప్రశంసలు వెల్లువెత్తాయి. ఈ నెల 20న నిర్వహించిన కోటిదీపోత్సవం విజయవంతమైన నేపథ్యంలో శనివారం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అభినందన సమావేశం నిర్వహించి సిబ్బందిని అభినందించారు.

సమష్టి కృషితోనే మహోత్సవ వైభవం..

ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ.. ప్రతి విభాగం సిబ్బంది ఎంతో నిబద్ధతతో, అంకితభావంతో విధులు నిర్వర్తించడం వల్లే కోటిదీపోత్సవం ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగిందన్నారు. ఆగమ పాఠశాల ఎదురుగా ఉన్న విశాల మైదానాన్ని చదును చేయడం నుంచి బ్యారికేడింగ్, కైలాసం నమూనాలో వేదిక నిర్మాణం, విద్యుద్దీపాలంకరణ, భద్రతా ఏర్పాట్ల వరకు ప్రతి అంశాన్ని సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. దీపోత్సవానికి అవసరమైన ఒత్తులు, ప్రమిదలను క్రమపద్ధతిలో ఏర్పాటు చేయడం, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, వివిధ విభాగాల మధ్య సమన్వయం వంటి పనుల్లో సిబ్బంది చూపిన చొరవ అభినందనీయమన్నారు. అర్చకస్వాములు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా పూజలు, దశహారతులు, దీపారాధన కైంకర్యాలను నిర్వహించి ఉత్సవానికి మరింత ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చారని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగికి పేరు పేరునా అభినందనలు తెలియజేస్తున్నానని చెప్పారు.

విస్తృతంగా ధర్మప్రచారానికి వేదిక...

ఇలాంటి మహత్తర ధార్మిక కార్యక్రమాలు సనాతన ధర్మ వైభవాన్ని చాటడంతో పాటు విస్తృతంగా ధర్మప్రచారం చేసేందుకు దోహదపడతాయని రమేష్‌నాయుడు అన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. శ్రీశైల దేవస్థానం నిర్వహించిన కోటిదీపోత్సవానికి దేశవ్యాప్తంగా విశేష ప్రచారం లభించడం ఆనందదాయకమన్నారు.

విశాల ప్రాంగణంతో భక్తులకు మరింత సౌకర్యం..

అంతకుముందు ఈవో ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గత ఏడాది ప్రధానాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం నుంచి నందిగుడి వరకు కోటిదీపోత్సవాన్ని నిర్వహించామని గుర్తుచేశారు. ఈసారి ఆగమ పాఠశాల ఎదురుగా ఉన్న విశాల ప్రాంగణంలో కార్యక్రమాన్ని నిర్వహించడం వల్ల అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం కలిగిందన్నారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం అన్ని విభాగాల సిబ్బంది పరస్పర సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయడం వల్లే కార్యక్రమం విజయవంతమైందని



తెలిపారు. దేవస్థానం సిబ్బందితో పాటు స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కోటిదీపోత్సవాన్ని ఆధ్యాత్మిక మహోత్సవంగా మార్చారని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఉద్యోగికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో వివిధ విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ఓటరు జాబితాలో చేర్చేందుకు చివరి అవకాశం

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో సమీక్ష



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్)అర్హులైన వారు ఓటర్ జాబితాలో చేర్చేందుకు ఇదే చివరి అవకాశమని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఎస్ ఐ ఆర్ లో భాగంగా ఏఎస్ డీ డీ అంశాలపై శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు/జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి హాజరయ్యారు.రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు ఎన్యుమరేషన్ ఫారాలతో పాటు మరోసారి క్షేత్రస్థాయికి వెళ్లి సంబంధిత ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అర్హులైన ఓటర్లు ఎవరూ ఓటు హక్కును కోల్పోకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణకు లభించిన ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి ఏజెంట్లు, అధికారుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే ప్రచారం చేసినప్పటికీ దరఖాస్తు చేసుకోకుండా మిగిలిపోయిన అర్హులైన ఓటర్లను గుర్తించి, వారికి మరోసారి అవగాహన కల్పించాలని తెలిపారు. ఏ ఎస్ డీ డీ జాబితాలో ఉన్నప్పటికీ నివాసం మారని ఓటర్లు నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించవలసిన అవసరం లేదని, నివాసం మారిన వారు మాత్రం ఎన్యుమరేషన్ ఫారంతో పాటు అనాక్సర్-సి సమర్పించాలని వివరించారు. ఈ ప్రక్రియపై సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, బూత్ స్థాయి అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేలా పర్యవేక్షించాలని తెలిపారు .వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, తహసీల్దార్లు మహేష్, జయంత్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ఉమారాణి, ఎలక్షన్ సెక్షన్ అధికారి రెహమాన్ తదితరులు ఉన్నారు.

స్వతంత్ర అభ్యర్థి మరియమ్మను పోటీ నుంచి తప్పించేందుకు ఒత్తిళ్లు, ఫోన్ బెదిరింపులు చేస్తున్నారంటూ ఆరోపణలు

నందిగామ :దామూలూరు గ్రామంలో సర్పంచ్ ఎన్నికల పోటీ ఆసక్తికరంగా మారింది. తెలుగుదేశం కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి మంద మహాలక్ష్మి, స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన ఇనపనూరి మరియమ్మ మధ్య ప్రధాన పోటీ నెలకొన్నట్లు గ్రామంలో చర్చ జరుగుతోంది. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున సర్పంచ్ స్థానానికి ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడం రాజకీయ వర్గాల్లో, గ్రామ ప్రజల్లో ఆశ్చర్యానికి గురిచేస్తోంది.గ్రామంలో టీడీపీ తరఫున నాలుగు వార్డులకు, జనసేన తరఫున ఒక వార్డుకు అభ్యర్థులు బరిలో ఉండగా, వైసీపీ తరఫున ఐదు వార్డులకు అభ్యర్థులను నిలబెట్టినట్లు సమాచారం. సర్పంచ్ ఎన్నికల్లో మాత్రం వైసీపీ పోటీకి దూరంగా ఉండటంపై పార్టీ కార్యకర్తల్లో అసంతృప్తి నెలకొన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.ఇదిలా ఉండగా, స్వతంత్ర అభ్యర్థిగా సర్పంచ్ బరిలో నిలిచిన ఇనపనూరి మరియమ్మ రెండు వార్డులకు కూడా నామినేషన్లు వేయించినట్లు సమాచారం. గ్రామంలో సర్పంచ్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి లేకపోవడంతో కూటమి అభ్యర్థి, స్వతంత్ర అభ్యర్థి మధ్యే ప్రధాన పోటీ ఉండనున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన మరియమ్మను నామినేషన్ ఉపసంహరించుకోవాలని కొందరు ఫోన్ ద్వారా ఒత్తిడి చేస్తున్నారని, గ్రామానికి వచ్చే రూ.15 లక్షల నిధులు వృథా అవుతాయని, తాము గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని చెబుతూ పోటీ నుంచి తప్పుకోవాలని కోరుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరియమ్మను పోటీ నుంచి తప్పించేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు.ఎస్సీ రిజర్వేషన్ వచ్చినప్పుడే అభివృద్ధి నిధుల పేరుతో అభ్యర్థులపై ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలు ఏవైనా, రిజర్వేషన్లు ఎవరికి వచ్చినా ప్రజాస్వామ్యంలో పోటీ చేసే హక్కు ప్రతి ఒక్కరికీ సమానంగా ఉండాలని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.పోటీలో ఉండే అభ్యర్థులకు రక్షణ కల్పించాలిఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులను భయపెట్టడం, ఫోన్ ద్వారా బెదిరించడం, బలవంతంగా నామినేషన్లు ఉపసంహరించుకునేలా ఒత్తిడి చేయడం వంటి చర్యలు చోటుచేసుకుంటే అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

తిరుచానూరులో ఆధ్యాత్మిక వైభవం

డిసెంబరు 6 నుంచి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు

తిరుమల బ్రహ్మోత్సవాల తరహాలో ఏర్పాట్లు

తిరుపతి(ప్రశ్న న్యూస్) తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ సన్నద్ధమవుతోంది. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తరహాలో అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ, దేశవిదేశాల నుంచి తరలివచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించేందుకు భారీ ఏర్పాట్లు చేపడుతోంది. డిసెంబరు 6 నుంచి 14వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో వాహనసేవలు, పుష్పాలంకరణలు, విద్యుద్దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.
శనివారం తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, రవాణా, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్యం, భద్రత తదితర విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పంచమితీర్థం రోజున లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

పంచమితీర్థానికి ప్రత్యేక ఏర్పాట్లు..

పంచమితీర్థం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక క్యూ లైన్లు, కంపార్ట్‌మెంట్లు, జర్మన్ షెడ్లు ఏర్పాటు చేయనున్నారు. ఎండ, వర్షాల నుంచి భక్తులకు రక్షణ కల్పించేలా సౌకర్యాలు కల్పించాలని ఈవో ఆదేశించారు. పుష్కరిణిలోకి భక్తులను విడతలవారీగా అనుమతిస్తూ, స్నానఘట్టాల వద్ద రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి, భద్రతా సిబ్బందితో నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నారు. తొక్కిసలాటకు తావులేకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేయాలని సూచించారు.

పడి ఊరేగింపునకు మార్గాల అభివృద్ధి..

తిరుమల శ్రీవారి ఆలయం నుంచి తిరుచానూరు వరకు పడి ఊరేగింపుగా వచ్చే మార్గాల్లో అవసరమైన రహదారి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించాలని, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

పుష్పశోభతో అమ్మవారి ఆలయం.. విద్యుద్దీపాల వెలుగుల్లో తిరుచానూరు..

ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో ఆలయం లోపల, వెలుపల ప్రత్యేక పుష్పాలంకరణలు ఏర్పాటు చేయనున్నారు. ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆలయ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దనున్నారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో ఆకర్షణీయమైన విద్యుద్దీపాలంకరణలు ఏర్పాటు చేసి ఉత్సవాలకు దివ్యశోభ తీసుకురానున్నారు. వాహనసేవలను భక్తులందరూ వీక్షించేలా ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ఈ సమీక్షలో జేఈవోలు డాక్టర్ ఏ. శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో కేవీ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిపై రెవెన్యూ శాఖ హెచ్చరిక బోర్డు

- రాయదుర్గం పాన్‌మక్తలో కలకలం, భవనంపైనే స్వాధీన ప్రకటన

- సర్వే నంబర్ 66/2లో ప్రభుత్వ భూమి ఆక్రమణపై అధికారుల కొరడా

- ఇన్నాళ్లూ పట్టించుకోని యంత్రాంగం ఇప్పుడైనా చర్యలు తీసుకుంటుందా.?

- ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు పూర్తిగా విఫలమా.?

లంచాల వ్యవహారమా.?


శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ యంత్రాంగం ఎట్టకేలకు కదిలిందా.? ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా ఇంతకాలం మౌనంగా ఉన్న అధికారులకు ఇప్పుడు చట్టం గుర్తుకొచ్చిందా.? శేర్లింగంపల్లి మండలం రాయదుర్గం పాన్‌మక్తలో చోటుచేసుకున్న పరిణామం ఈ ప్రశ్నలకు తావిస్తోంది. ప్రభుత్వ భూమిలో ఉన్న భవనంపైనే రెవెన్యూ అధికారులు హెచ్చరిక బ్యానర్ ఏర్పాటు చేయడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.గ్రామంలోని సర్వే నంబర్ 66/2, ప్లాట్ నంబర్ 2లోని భూమి ప్రభుత్వానికి చెందినదని, ఇప్పటికే ఆ భూమిని స్వాధీనం చేసుకుని రెవెన్యూ శాఖ ఆధీనంలోకి తీసుకున్నట్లు అధికారులు బ్యానర్ ద్వారా ప్రకటించారు. తెలంగాణ భూ ఆక్రమణ నిరోధక చట్టం--1905 ప్రకారం ఈ చర్య చేపట్టినట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా సదరు భూమిలోకి అక్రమంగా ప్రవేశించడం, ఆక్రమణలకు పాల్పడటం, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం నిషేధమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తేల్చిచెప్పారు.అయితే ఇక్కడే అసలు ప్రశ్నలు మొదలవుతున్నాయి. ప్రభుత్వ భూమిలో భవనం నిర్మాణం జరిగే వరకు సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారు.? నిర్మాణాలు జరుగుతున్న సమయంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఎందుకు స్పందించలేదు.? ప్రభుత్వ భూమి అని గుర్తించిన తర్వాత దానిపై నిర్మాణాలు ఎలా వెలిశాయి.? ఆక్రమణలు జరిగిన తర్వాత బ్యానర్లు ఏర్పాటు చేయడమే ప్రభుత్వ భూముల పరిరక్షణా.? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.డిప్యూటీ కలెక్టర్, శేర్లింగంపల్లి తహసీల్దార్ పేరుతో ఏర్పాటు చేసిన హెచ్చరిక బ్యానర్ కేవలం ప్రకటనకే పరిమితం కాకుండా, తదుపరి చర్యల్లోనూ అదే దూకుడు



చూపించాల్సిన అవసరం ఉంటుందా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భూమి స్వాధీనానికి సంబంధించిన పూర్తి వివరాలు, ఆక్రమణదారులపై తీసుకున్న చర్యలు, నిర్మాణం తొలగింపుపై అధికార యంత్రాంగం స్పష్టత ఇవ్వాల్సి ఉంది.ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులే ఆక్రమణలు జరిగి భవన నిర్మాణం తర్వాత మేల్కొంటే ప్రజాధనానికి రక్షణ ఎలా.? బ్యానర్‌తో సరిపెడతారా.? లేక అక్రమ నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటారా.? స్వాధీనం చేసుకుంటారా.? అన్నది వేచి చూడాలి.



‘అన్బిల్ అవన్’ (సోనీలివ్) మూవీ రివ్యూ!



తమిళంలో ఇటీవల విడుదలైన ఒక సర్వైవల్ థ్రిల్లర్, ప్రేక్షకులను బాగానే ఆకట్టుకుంది. తక్కువ బడ్జెట్ లో రూపొందిన ఈ సినిమా, కంటెంట్ పరంగా ఆడియన్స్ ను కట్టిపడేసిందనే టాక్ వచ్చింది. అశోక్ సెల్వన్ .. ప్రీతీ ముకుందన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమాకి, కార్తికేయన్ దర్శకత్వం వహించాడు. అక్టోబర్ 2వ తేదీన విడుదలైన ఈ సినిమా, ఈ నెల 20వ తేదీ నుంచి ‘సోనీ లివ్’లో స్ట్రీమింగ్ అవుతోంది. రొమాన్స్ ను .. యాక్షన్ ను టచ్ చేస్తూ సాగే ఈ సినిమా, తెలుగులోను అందుబాటులో ఉంది. సూర్య (అశోక్ సెల్వన్) ఇందు (ప్రీతీ ముకుందన్) ప్రేమించుకుంటారు. కలిసి జీవించాలనే ఒక నిర్ణయానికి రాగానే పెళ్లి చేసుకుంటారు. ఇద్దరూ ఒక స్టార్ హోటల్లో పనిచేస్తూ ఉంటారు. అయితే అక్కడి పని ఒత్తిడిని .. అవమానాలను తట్టుకోలేక పోతారు. ఒక ప్రశాంతమైన ప్రదేశంలో ‘హోమ్ స్టే’ను ఏర్పాటు చేసి, దానిని డెవలప్ చేస్తూ వెళ్లాలని భావిస్తారు. నగరానికి దూరంగా .. అటవీ ప్రాంతానికి దగ్గరగా ఒక పాడుబడిన బంగ్లాను చూస్తారు. అది వారికి చాలా బాగా నచ్చుతుంది. ఆ బంగళా వైపు వెళుతున్న సమయంలోనే, అక్కడి ఎమ్మెల్యే ‘రాజ నాయగం’ మనుషులతో సూర్యకి గొడవ అవుతుంది. ఎమ్మెల్యే మనుషులకు నాయకత్వం వహించే ‘మార్టిన్’ను అక్కడే మొదటిసారిగా చూస్తాడు సూర్య. ఆ విషయాన్ని లైట్ తీసుకున్న సూర్య, ఆ బంగళాపై దృష్టి పెడతాడు. ఒకప్పుడు రాణి పద్మిని (రేవతి) నివసించిన బంగ్లా అది. ఇప్పుడు ఆమెకి అది ఒక అందమైన జ్ఞాపకం. అందువలన ఆమె ఆ బంగ్లాను ఎవరికీ అమ్మకుండా అలా ఉంచేస్తుంది. ఆమెను కలుసుకుని అతికష్టం మీద ఒప్పించి ఆ బంగళాను సూర్య కొనుగోలు చేస్తాడు. సూర్య ఆ బంగ్లా కొనుగోలు చేసి, దానిని రీమోడల్ చేయించడం మొదలుపెడతాడు. అప్పటి నుంచి ఎమ్మెల్యే మనుషుల దాడి అంచెలంచెలుగా పెరుగుతూ పోతుంటుంది. గతంలో జరిగిన గొడవ అందుకు కారణమని సూర్య భావిస్తాడు. పోలీస్ ఆఫీసర్ ‘తవసి’ని కలిసి ఫిర్యాదు చేస్తాడు. అయితే అతను కూడా రాజానాయగానికి అనుకూలంగా స్పందిస్తాడు. అంతే కాదు .. ‘ఇందు’ గురించి వంకరగా మాట్లాడతాడు. ఈ కేసు గురించి ఇంటికి వచ్చి ఇందుతో అసభ్యంగా ప్రవర్తిస్తాడు. ఆ ఇంటిని సొంతం చేసుకోవడం కోసమే ఆ ఎమ్మెల్యే అలా చేస్తున్నాడనే విషయం అప్పుడు సూర్యకి అర్థమవుతుంది. సూర్య దంపతులను బెదిరించి అతని ఇంట్లో ఏనుగు దంతాలు .. మాదక ద్రవ్యాలు .. పేలుడు పదార్థాలు పెట్టిస్తాడు రాజానాయగం. ఆ కేసులో సూర్యను జైలుకు పంపించాలనేది అతని ఆలోచన. ఈ విషయంలో అతనికి వకీలు మార్టిన్ .. పోలీస్ ఆఫీసర్ తవసి సపోర్టు ఫుల్ గా ఉంటుంది. ఇదే సమయంలో తనకి వ్యతిరేకంగా పోలీస్ పైఅధికారులకు ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించిన నాగరాజును రాజనాయగం హత్య చేస్తాడు. ఆ హత్యను సూర్య వీడియో తీస్తాడు. ఫలితంగా ఏం జరుగుతుంది? రాజనాయగం అనుచరులు ఏం చేస్తారు? సూర్య దంపతులు అక్కడి నుంచి ప్రాణాలతో బయటపడతారా? అనేది మిగతా కథ. అది అడవికి దగ్గరగా ఉన్న ఒక ప్రాంతం. ఆ ప్రాంతంలో రౌడీయిజమైనా రాజకీయమైనా రాజనాయగం చేయవలసిందే. అక్కడి రాణి పద్మినీ బంగళాపై అతను కన్నేస్తాడు. కానీ అలాంటి వారికి ఆ బంగళాను అమ్మడం ఆమెకి ఇష్టం ఉండదు. అందువలన ఆమె నుంచి ఆ బంగళాను తీసుకున్న సూర్య దంపతులపైకి తన అనుచరులను పురిగొల్పుతాడు. ఆ బంగళా ఖాళీ చేసి వాళ్లు పారిపోయేలా చేయాలనుకుంటాడు. అందుకోసం అతను చేసే ప్రయత్నాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఈ కథ లవ్ .. రొమాన్స్ తో మొదలవుతుంది. ఎమ్మెల్యే మనుషులతో సూర్య గొడవ పడటంతో కథ మొదటి మలుపు తీసుకుంటుంది. వకీల్ మార్టిన్ .. పోలీస్ ఆఫీసర్ తవసి, ఎమ్మెల్యే మనుషులేనని సూర్యకి అర్థం కావడంతో రెండో మలుపు తిరుగుతుంది. తన భార్య కోసం తాను కొన్న బంగళాను ఎమ్మెల్యేకి భయపడి వదులుకోకూడదని హీరో నిర్ణయించుకోవడంతో కథ మరింత పుంజుకుంటుంది. ఇక ఎమ్మెల్యే ఒక మర్డర్ చేయడాన్ని సూర్య సెల్ ఫోన్ తో రికార్డు చేయడంతో కథ మరింత చిక్కబడుతుంది. సూర్యను వకీలు టార్గెట్ చేయడం .. ఇందుపై వ్యామోహంతో ఆమెను పోలీస్ ఆఫీసర్ టార్చర్ చేయడం .. దంపతులిద్దరికీ మనఃశాంతి లేకుండా ఎమ్మెల్యే వేసే ఎత్తులతో ఈ కథ ఇంట్రెస్టింగ్ గా కొనసాగుతుంది. అందుకు సంబంధించిన సన్నివేశాలు ఆసక్తికరంగా డిజైన్ చేశారు. తన భార్యను రక్షించుకోవడం కోసం .. తన ఇంటిని కాపాడుకోవడం కోసం ఒక సాధారణ యువకుడు చేసే పోరాటం గొప్పగా అనిపిస్తుంది. సహజత్వానికి దగ్గరగా ఉండే ఈ సన్నివేశాలు ప్రేక్షకులు కథలో పూర్తిగా ఇన్వాల్వ్ అయ్యేలా చేస్తాయి. రాజకీయ నాయకుడు .. వకీలు .. పోలీస్ ఆఫీసర్ .. వాళ్ల అనుచరులు, సూర్య దంపతుల ఇంటిని చుట్టముట్టడంతో ఈ కథ క్లైమాక్స్ దిశగా పరుగులు పెడుతుంది. చివరి 40 నిమిషాలకు సంబంధించిన కథ ప్రేక్షకులను కదలనీయకుండా చేస్తుంది. చాలా ప్రాంతాలలో ఇలాంటి సంఘటనలు చూసి ఉండటం వలన .. విని ఉండటం వలన ఆడియన్స్ వెంటనే కనెక్ట్ అవుతారు. క్లైమాక్స్ ను డిజైన్ చేసిన విధానం ఆడియన్స్ నుంచి మంచి మార్కులు కొట్టేస్తుంది. భార్యాభర్తలు .. రాజకీయ నాయకుడు .. వకీల్ .. పోలీస్ ఆఫీసర్, ఈ ఐదు గురు చుట్టూ తిరిగే ఈ కథ ప్రేక్షకులను టెన్షన్ పెడుతుంది. పాత్రధారులంతా చాలా సహజంగా నటించారు. కార్తికేయన్ టేకింగ్ .. గౌతమ్ రాజేంద్రన్ ఫొటోగ్రఫీ .. గోవింద్ వసంత నేపథ్య సంగీతం .. సెల్వ ఎడిటింగ్ ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్ కి తీసుకుని వెళ్లాయి. సర్వైవల్ థ్రిల్లర్ జోనర్ ను ఇష్టపడేవారికి, ఈ సినిమా నచ్చుతుందని చెప్పచ్చు.

అమెరికాలో ‘ఈ నగరానికి

ఏమైంది 2 జోరు

రెండు రోజుల్లోనే 7.5 లక్షల డాలర్ల వసూళ్లు!



టాలీవుడ్‌లో యూత్ ఆడియన్స్‌ను ఆకట్టుకున్న సినిమాలకు సీక్వెల్స్ వస్తే ఉండే క్రేజ్ అంతా ఇంతా కాదు. అలాంటి అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం ‘ఈ నగరానికి ఏమైంది 2’. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా, దర్శకుడు తరుణ్ భాస్కర్ తెరకెక్కించిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ విడుదలకు ముందే మంచి హైప్‌ను సొంతం చేసుకుంది. ఇక ప్రీమియర్స్ నుంచే పాజిటివ్ రెస్పాన్స్ అందుకుంటూ బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తోంది. భారత్‌తో పాటు ఓవర్సీస్ మార్కెట్‌లోనూ ఈ సినిమా మంచి వసూళ్లను రాబడుతోంది. ముఖ్యంగా అమెరికాలో ఈ చిత్రం అదిరిపోయే ఆరంభాన్ని అందుకుంది. విడుదలైన మొదటి రెండు రోజుల్లోనే 7.5 లక్షల డాలర్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. ఈ జోరు ఇలాగే కొనసాగితే వీకెండ్ ముగిసేలోపే 1 మిలియన్ డాలర్ల మార్కు ను దాటే అవకాశాలు కనిపిస్తున్నా యి. తెలుగు సినిమాలకు అమెరికా మార్కెట్ కీలకంగా మారుతున్న నేపథ్యంలో ‘ఈ నగరానికి ఏమైంది 2’ సాధిస్తున్న వసూళ్లు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా యూత్ ఆడియన్స్‌లో ఈ సినిమాకు మంచి ఆదరణ లభిస్తుండటం ఓవర్సీస్ కలెక్షన్లకు కలిసొస్తోంది. ప్రీమియర్స్ నుంచే వచ్చిన స్పందన బాక్సాఫీస్ దగ్గర కూడా కనిపిస్తోంది. ఈ సినిమాలో విశ్వక్ సేన్‌తో పాటు ఆయన స్నేహితుల గ్యాంగ్ చేసే సందడి ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. మొదటి భాగానికి ఉన్న క్రేజ్, తరుణ్ భాస్కర్ దర్శకత్వంపై ప్రేక్షకుల్లో ఉన్న నమ్మకం ఈ సీక్వెల్‌కు మంచి ఓపెనింగ్స్ రావడానికి దోహదపడిన అంశాలుగా చెప్పుకోవచ్చు. వివేక్, ఆయన గ్యాంగ్ మరోసారి ప్రేక్షకులను అలరిస్తూ అమెరికాలోనూ వసూళ్ల వేట కొనసాగిస్తున్నారు.

ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతం అందించారు. సృజన్ ఎరబోలు, సందీప్ నాగిరెడ్డి సంయుక్తంగా నిర్మించారు. మరి ప్రస్తుత వసూళ్ల జోరు చూస్తుంటే ‘ఈ నగరానికి ఏమైంది 2’ త్వరలోనే అమెరికాలో 1 మిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరుతుందా? అనేది ఆసక్తికరంగా మారింది.

టాలీవుడ్‌లో


కొత్త ట్విస్ట్..

‘హను-మాన్’ సీక్వెల్‌లో మెగా హీరో!



టాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన ‘హను-మాన్’ సినిమా సీక్వెల్‌పై ఊహించని పరిణామం చోటుచేసుకుంది. మొదటి భాగాన్ని నిర్మించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ, మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా ‘హను-మాన్ 2’ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రానికి ‘హను-మాన్ 2: ది రైజ్ ఆఫ్ వానరాస్’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ‘ఎక్కడికి పోతావు చిన్నవాడా’, ‘ఊరు పేరు భైరవకోన’ వంటి చిత్రాలతో గుర్తింపు పొందిన వీఐ ఆనంద్ ఈ పాన్-ఇండియా ప్రాజెక్టుకు దర్శకత్వం వహించనున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందులో కండలు తిరిగిన దేహంతో వైష్ణవ్ తేజ్ వెనక్కి తిరిగి నిలబడి ఉండగా, ఒక భారీ హనుమంతుడి తోక ఆయన్ను ఆకాశంలోకి ఎత్తుతున్నట్లుగా డిజైన్ చేశారు. కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. అయితే, ఈ ప్రకటన ఇప్పుడు సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ‘హను-మాన్’ దర్శకుడు ప్రశాంత్ వర్మ, రిషబ్ శెట్టి హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో ‘జై హనుమాన్’ చిత్రాన్ని ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ‘హను-మాన్’ సీక్వెల్ హక్కులు తమకే ఉన్నాయని భావిస్తున్న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్, ఇప్పుడు మరో హీరో, దర్శకుడితో ‘హను-మాన్ 2’ను ప్రకటించడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుండగా, ఇతర నటీనటుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

‘ఆకాశంలో ఒక తార’ (మూవీ రివ్యూ)



దుల్కర్ సల్మాన్ మొదటి నుంచి మలయాళ సినిమాలతో పాటు, టాలీవుడ్ మార్కెట్ పై కూడా ఎక్కువ దృష్టి పెడుతూ వస్తున్నాడు. తన సినిమాలు మలయాళంతో పాటు తెలుగులోనూ విడుదలయ్యేలా చూసుకుంటున్నాడు. ఏ మాత్రం అవకాశం చిక్కినా నేరుగా తెలుగు సినిమాలు చేస్తూ, ఇక్కడి ఆడియన్స్ కి మరింత చేరువవుతున్నాడు. అలా ఆయన చేసిన తాజా చిత్రంగా ‘ఆకాశంలో ఒక తార’ ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ‘పాలలంక’ అనే చిన్న ఊళ్లో .. ప్రభుత్వ పాఠశాలలో ‘కల్పన’ (సాత్విక వీరవల్లి) చదువుతూ ఉంటుంది. పదో తరగతి నుంచి ఆమెకి అంతరిక్షం పై ఇష్టం ఏర్పడుతుంది. వ్యోమగామి కావాలనే కోరిక ఆమెతో పాటు పెరుగుతూ పోతుంది. అయితే ఆమె చదువుకు అడ్డుచెబుతూ వచ్చిన తండ్రి, పదో తరగతి పరీక్షలు రాయగానే ‘కృష్ణ’ (దుల్కర్ సల్మాన్)తో ఆమె పెళ్లి జరిపిస్తాడు. భర్తను కోల్పోయి .. ఒక ఆడపిల్లతో పుట్టింటికి చేరిన కృష్ణ అక్కయ్య సరస్వతి (స్వాసిక) పెత్తనమే ఆ ఇంట్లో నడుస్తుంటుంది. ‘కల్పన’ మైనర్ అని తెలుసుకున్న కృష్ణ, ఆమెకి ఇంకా చదువుకోవాలని ఉందని గ్రహిస్తాడు. అంతరిక్ష వ్యోమగామి కావాలనేది ఆమె ఆశయమని తెలుసుకుని, అందుకు సంబంధించిన చదువు చెప్పిస్తూ వెళతాడు. అందుకోసం ఆమెను హైదరాబాద్ కి తీసుకుని వెళతాడు. తాను డ్రైవర్ గా పనిచేస్తూ, ఆమెను ప్రోత్సహిస్తూ వెళతాడు. ఆమె నిరుత్సాహపడిన ప్రతిసారీ తాను ఉన్నానంటూ అండగా నిలబడతాడు. అయినా కొన్ని కారణాల వలన ఆమె తన ‘కల’ను పక్కన పెట్టాలని అనుకుంటుంది. అలాంటి పరిస్థితులలో రోహిణి (శృతి హాసన్) కల్పన గురించి వింటుంది. తాను ఎలాగైనా కల్పనను కలుసుకోవాలని అనుకుంటుంది. అందుకు సంబంధించిన ప్రయత్నాలను ముమ్మరం చేస్తుంది. రోహిణి నేపథ్యం ఏమిటి? కల్పనను ఆమె ఎందుకోసం కలవాలని అనుకుంటుంది? అందుకు సంబంధించిన ప్రయత్నాలు ఫలిస్తాయా? అంతరిక్ష వ్యోమగామి కావాలనే కల్పన కోరిక నెరవేరుతుందా? అనేది మిగతా కథ. ఆడపిల్లలను చదివించడం అనవసరమనే ఒక ఆలోచన, ఇప్పటికీ కొన్ని గ్రామీణ ప్రాంతాలలో కనిపిస్తుంది. అలాంటి ఒక ఆలోచన పక్కన పెట్టేసి వాళ్లను ప్రోత్సహిస్తే ఎన్నో అద్భుతాలు సృష్టిస్తారనే విషయం చుట్టూ అల్లుకున్న కథ ఇది. బలమైన సంకల్పం ఉంటే .. కాస్త చేయూతనిచ్చేవారుంటే పేదరికాన్ని దాటుకుని .. ప్రతికూల పరిస్థితులను దాటుకుని ముందుకు వెళ్లడం సాధ్యమే అని నిరూపించడానికి దర్శకుడు చేసిన ప్రయత్నం ఇది. తన కలను నిజం చేసుకోవడానికి ఒక పేదింటి అమ్మాయి .. పల్లెటూరి అమ్మాయి ఎంతగా ఆరాటపడుతుంది .. తాను అనుకున్నది సాధించడం కోసం ఎన్ని అవమానాలను ఎదుర్కొంటుంది .. ఆమె కలను నిజం చేయడం కోసం ఆమె భర్త ఎన్ని కష్టాలను ఎదుర్కుంటూ వెళ్లాడు అనేది ఈ సినిమా ఫస్టాఫ్ గా ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఇక కాలేజ్ స్థాయి నుంచి రాకెట్ సైన్స్ లో కొత్త పద్ధతులను గురించిన ఆలోచనలు చేయడం .. విఫలమైన ప్రతిసారి కుంగిపోకుండా మరింత పట్టుదలతో ముందుకు సాగడం వంటి సన్నివేశాలతో సెకండాఫ్ కొనసాగుతుంది. ఇక ఆమె కల .. భర్త కష్టం ఫలిస్తాయా లేదా అనే ఒక చిన్నపాటి టెన్షన్ తో ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ సాగుతాయి. సస్పెన్స్ .. ఎమోషన్స్ కలిసిన ఈ సన్నివేశాలు మనసును బలంగా పట్టుకుంటాయి. మట్టి రోడ్డు కూడా సరిగ్గా లేని ఒక మారుమూల గ్రామం నుంచి, ప్రపంచాన్ని తన వైపుకు తిప్పుకునేలా చేసిన ఒక పల్లెటూరి అమ్మాయి కథ ఇది. తన భార్య ఆనందం కోసం .. ఆశయం కోసం ఆమెకి దూరంగా ఉంటూ కష్టపడే ఒక ఆదర్శవంతమైన భర్త కథ ఇది. దర్శకుడు ఈ కథలో వినోదానికి .. పాటలకు ప్రాధాన్యతను ఇవ్వలేదు. తాను చెప్పదలచుకున్న విషయాన్ని కాస్త సీరియస్ గానే చెబుతూ వెళ్లాడు. ఒక అమ్మాయి అంతరిక్ష ప్రయాణానికి సంబంధించిన కథను, ఆమె భర్త గుజరాత్ లోని బొగ్గు గనులలో పనిచేయడంతో మొదలుపెట్టడం ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. అంతరిక్షానికి సంబంధించిన సన్నివేశాలు సాధారణ ప్రేక్షకులకు కూడా అర్థమయ్యేలానే రాసుకోవడం గొప్ప విషయం. ఈ తరహా స్ఫూర్తి ప్రధానమైన కథలకు .. బలమైన సంభాషణలు అవసరం. అలాంటి సంభాషణలు అక్కడక్కడా పేలాయి. ‘తన కలలకు కాళ్లుగా మారిపోయి నడిపిస్తాను ‘.. ‘నీ లక్ష్యం ఆకాశమైనప్పుడు ఈ భూమితో నేనేం చేసుకుంటాను’ . .’పదిమంది నవ్వితే ఏంటి? ఒక్కరు నమ్మితే చాలదా’ .. ‘తన కలకు తాను దగ్గరవ్వాలంటే తనకి నేను దూరం కావాలి’.. వంటి సంభాషణలు గుర్తుండిపోతాయి. సుజీత్ సారంగ్ ఫొటోగ్రఫీ ఆకట్టుకుంటుంది. జీవీ ప్రకాశ్ కుమార్ నేపథ్య సంగీతం అదనపు బలంగా నిలిచిందనే చెప్పాలి. ప్రవీణ్ ఎడిటింగ్ పనితీరు కూడా మెప్పిస్తుంది. సాత్విక నటన ఈ సినిమాకి ప్రధానమైన ఆకర్షణ అని చెప్పాలి. అందం .. అమాయకత్వం .. ఆత్మవిశ్వాసం కలిగిన ఈ పాత్రలో ఆమె రాణించింది. విశాలమైన కళ్లతో హావభావాలను గొప్పగా పండించింది. భార్యను ప్రేమించడమే కాదు, ఆమె ఆశయాన్ని నెరవేర్చే ఆయుధంగా కూడా మారాలి అని చెప్పే పాత్రలో దుల్కర్ నటన మెప్పిస్తుంది. పల్లెటూరులో నాలుగు గోడల మధ్య అమ్మాయిల ప్రతిభను బంధించి, సూటిపోటి మాటలతో మానసిక ఆనందాన్ని పొందడం కాదు, వాళ్ల ప్రతిభను గుర్తించి ఎగరనీయాలి .. ఎదగనీయాలి అనే వైపు నుంచి స్వాసిక అభినయం మంచి మార్కులు కొట్టేస్తుంది. ఇక శృతిహాసన్ .. రుహాని శర్మ నటన కూడా బాగుంది. ప్రవాహానికి కూడా అనేక అడ్డంకులు ఎదురవుతూ ఉంటాయి. అయినా వాటిని దాటుకుంటూ అది ముందుకు సాగుతూనే ఉంటుంది. ప్రతి ప్రయాణాన్ని విజయంతోనే ముగించాలి. చదువుకోవాలనే తపనే విజేతగా నిలబెడుతుంది. ప్రపంచంలో ఒక గుర్తింపును తీసుకొస్తుందని చాటిచెప్పే చిత్రమిది. కుటుంబ సభ్యులతో కలిసి చూడవలసిన స్ఫూర్తిప్రధానమైన సినిమా ఇది.

ప్రశ్నలతో విసిగించాను!



సూపర్‌స్టార్ రజనీకాంత్ ‘ధర్మన్’ సినిమాలో కీలకపాత్ర పోషిస్తున్నది అందాల తార రాశీఖన్నా. ఆ సినిమా లొకేషన్‌లో రజనీతో తన అనుభవాలను ఆసక్తికరంగా వెల్లడించారామె ‘నా కెరీర్‌లో చాలామంది స్టార్లతో పనిచేశాను. ఇప్పుడు ‘ధర్మన్’లో సూపర్‌స్టార్‌తో పనిచేస్తున్నాను. నిజానికి స్టార్‌డమ్ ఎంజాయ్ చేస్తున్న వారి ప్రవర్తన విభిన్నంగా ఉంటుంది. కానీ కొన్ని దశాబ్దాలుగా సూపర్‌స్టార్‌డమ్‌ని ఎంజాయ్ చేస్తున్న రజనీసార్ ఆటిట్యూడ్ వారందరికీ పూర్తి భిన్నం. నిజం చెబుతున్నా.. లొకేషన్‌లో రజనీసార్ నాకు ఫ్రెండ్ అయిపోయారు. సెట్‌లో ఆయన పక్కన ఉంటే చిన్నపిల్లలా మారిపోయేదాన్ని. ఆయనతో ఎంత చనువు ఏర్పడిందంటే.. ఒక్కోసారి ప్రశ్నలతో విసిగించేదాన్ని. ఆయన మాత్రం నవ్వుతూ ఓపిగ్గా సమాధానాలు చెప్పేవారు. అంత సూపర్‌స్టార్‌తో మాట్లాడాలంటే ఎవరికైనా బెరుకే. నేను మాత్రం ఆయన పక్కన కూర్చొని చాలా విషయాలు మాట్లాడేదాన్ని. ఏ మాత్రం గర్వం లేకుండా నిరాడంబరంగా ఉండే ఆయన్ను చూస్తుంటే చాలా ముచ్చటేసేది’ అంటూ చెప్పుకొచ్చింది రాశీఖన్నా.

అదే విజయానికి కొలమానం



‘ఈ సినిమా ప్రీమియర్‌షోస్ పూర్తయిన దగ్గరి నుంచి నా ఫోన్ మోగుతూనే ఉంది. కొందరు పత్రికాధిపతులు కూడా ఫోన్ చేసి గొప్ప సినిమా తీశారని మెచ్చుకున్నారు. ఈ సినిమాలో హీరో, విలన్ అంటూ ఎవరూ లేరు. అన్నీ హృదయాన్ని కదిలించే పాత్రలే ఉన్నాయి’ అన్నారు అగ్ర నిర్మాత అల్లు అరవింద్. ఆయన నిర్మాణ భాగస్వామిగా రూపొందించిన ‘ఆకాశంలో ఒక తార’ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి జంటగా నటించిన ఈ చిత్రానికి పవన్ సాధినేని దర్శకత్వం వహించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అల్లు అరవింద్ మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. ఇంకా ఆయన చెబుతూ ‘దర్శకుడు పవన్ సాధినేని తన తదుపరి చిత్రాన్ని మా బ్యానర్‌లోనే చేయబోతున్నాడు. అతని వర్క్ అంతలా నచ్చింది. ఈ సినిమాకు ఓవర్సీస్ రెస్పాన్స్ కూడా అద్భుతంగా ఉంది. దుల్కర్ సల్మాన్ తన పాత్రలో జీవించారు. ఈ సినిమాతో సాత్విక వీరవల్లి పెద్దస్టార్ అయిపోయింది.

సమోసాలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించిన వ్యక్తిని కబళించిన మృత్యువు

- భర్త మరణంతో అనాథలైన ఇద్దరు చిన్నారులు.మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లేందుకు కూడా డబ్బుల్లేని దయనీయ పరిస్థితి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి –గూడూరు శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ నిరుపేద కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. పొట్టకూటి కోసం రైళ్లలో సమోసాలు అమ్ముకుంటూ భార్య, ఇద్దరు చిన్నారి ఆడపిల్లలను పోషించుకుంటున్న ఓ సామాన్యుడిని విధి చిన్నచూపు చూసింది. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న భర్త ఆకస్మిక గుండెపోటుతో మృతిచెందడంతో ఆ కుటుంబం దిక్కులేనిదిగా మారింది. కనీసం భర్త మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు కూడా చేతిలో డబ్బుల్లేక భార్య పడుతున్న ఆవేదన పలువురిని కంటతడి పెట్టిస్తోంది.వివరాల్లోకి వెళితే. శ్రీకాళహస్తి పట్టణంలోని ఓటేరు కాలువ ప్రాంతానికి చెందిన సూరి అలియాస్ బాబి రైళ్లలో సమోసాలు విక్రయిస్తూ జీవనం సాగించేవాడు.రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితుల్లో ఉన్నప్పటికీ, తన ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తు కోసం నిరంతరం కష్టపడేవాడు. ఈ క్రమంలో ఎప్పటిలాగే వ్యాపారం నిమిత్తం గూడూరుకు వెళ్లిన ఆయనకు అకస్మాత్తుగా తీవ్ర గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయి ప్రాణాలు విడిచాడు. ప్రస్తుతం ఆయన మృతదేహం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంది.భర్త మరణవార్త విన్న భార్య ఇద్దరు చిన్నారి కుమార్తెలతో కలిసి గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుంది. కళ్లముందే భర్త విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి గుండెలవిసేలా రోదిస్తోంది. ఆ కుటుంబానికి అండగా నిలిచే బంధువులు సైతం ఎవరూ లేకపోవడంతో ఆమె పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఒకవైపు భర్త మృతదేహాన్ని శ్రీకాళహస్తికి తీసుకురావడానికి డబ్బుల్లేక, మరోవైపు ఇద్దరు చిన్నారులను ఎలా పోషించుకోవాలో తెలియక ఆ తల్లి కన్నీరుమున్నీరవుతోంది.ఎమ్మెల్యేకు, దాతలకు కన్నీటి విజ్ఞప్తి

తీవ్ర నిస్సహాయ స్థితిలో ఉన్న ఆ మహిళ చేతులు జోడించి స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలను సహాయం కోసం వేడుకుంటోంది. ముఖ్యంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కన్నీటితో విజ్ఞప్తి చేస్తోంది.మాకు ఈ లోకంలో ఎవరూ లేరు సార్. నా భర్త చనిపోయాడు.ఇద్దరు చిన్నారి ఆడపిల్లలతో నేను ఎలా బతకాలి. కనీసం నా భర్త మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లడానికి కూడా డబ్బులు లేవు. దయచేసి మాకు ఆర్థిక సహాయం చేసి ఆదుకోండి అంటూ ఆమె చేస్తున్న వేడుకోలు హృదయాలను కలచివేస్తోంది.మానవత్వంతో ఆదుకోవాల్సిన. సమయం కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోయిన ఈ నిరుపేద కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరం ఉంది. ముందుగా మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించేందుకు సహకరించడంతో పాటు, తల్లితోపాటు ఇద్దరు చిన్నారి ఆడపిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది.శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, సేవాభావం కలిగిన దాతలు వెంటనే స్పందించి ఆ కుటుంబానికి అండగా నిలవాలని స్థానికులు కోరుతున్నారు.రెండు చిన్నారి ఆడపిల్లల కన్నీళ్లు తుడిచి, ఆ కుటుంబానికి కొత్త భరోసా కల్పించేందుకు మానవతావాదులు ముందుకు రావాల్సిన సమయమిది.

శ్రీకాళహస్తిలో వైకాపా అభ్యర్థుల ఇంటింటి ప్రచారం

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష గెలిపిస్తే పట్టణ అభివృద్ధికి

పెద్దపీట జ్ఞానాంబవారి మధురెడ్డిదాస్



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి పురపాలక సంఘం ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 26వ తేదీన మున్సిపల్ చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్ల ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి జ్ఞానాంబవారి మధురెడ్డిదాస్, 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కళ్యాణితో కలిసి వార్డులో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికీ వెళ్లి గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైకాపా కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు తనను కూడా అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని జ్ఞానాంబవారి మధురెడ్డిదాస్ ఓటర్లను అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్ష అని, ప్రజల ఆదరణతో వైకాపా అభ్యర్థులు అఖండ మెజారిటీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. తాను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన వెంటనే పురపాలక సంఘం సిబ్బందికి ప్రతి ఏటా దీపావళి కానుకలు అందజేస్తామని హామీ ఇచ్చారు.అలాగే శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలను తానే స్వయంగా దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని, ఆయా గ్రామాల ప్రజలకు ఆస్తి పన్నులో రాయితీ కల్పించేలా కృషి చేస్తానని తెలిపారు.పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని, శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం నుంచి నిధులు తీసుకువచ్చి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆలయ పరిసరాల్లోని నాలుగు మాడ వీధుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రస్తుత డ్రైనేజీ వ్యవస్థ స్థానంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని ఈ సందర్భంగా ప్రజలకు హామీ ఇచ్చారు.

భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపాలి

శ్రీ వీరాచల రామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలకు

ప్రత్యేక బస్సులు నడపాలి: గట్టు శ్రీనివాసాచార్యులు



ఉప్పల్ (ప్రశ్న న్యూస్)తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రాచుర్యం పొందిన శ్రీ వీరాచల రామచంద్రస్వామి వారి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడపాలని ఉప్పల్ డిపో , జనగాం డిపో మేనేజర్‌కు భాగ్యనగర్ అర్చక పురోహిత సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గట్టు శ్రీనివాసాచార్యులు డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ఆలయానికి తరలివస్తారని, అందువల్ల భక్తుల సౌకర్యార్థం మరియు ఆలయాల అభివృద్ధికి తోడ్పడుతూ జీడీకల్ గ్రామానికి డిపో నుండి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని వారు కోరారు. నవంబర్ 23 నుండి డిసెంబర్ 5 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని, ఇందులో నవంబర్ 27న ఎదుర్కోళ్ల మహోత్సవం, నవంబర్ 28న స్వామివారి కల్యాణ మహోత్సవం, నవంబర్ 29న రథోత్సవం వంటి ముఖ్య ఘట్టాలు ఉన్నాయని తెలిపారు.

ఇంద్రకీలాద్రిపై భక్తి సందడి.. దీపోత్సవానికి సర్వం సిద్ధం

- భవానీ దీక్షలతో కొండపై ఆధ్యాత్మిక సందడి..

24న కార్తీక దీపోత్సవం

- 8 సెక్టార్లలో దీపాలంకరణలు.. 700 మందికి పైగా సేవాదారులతో ఏర్పాట్లు

విజయవాడ (ప్రశ్న న్యూస్)విజయవాడ ఇంద్రకీలాద్రి భక్తజన సంద్రంగా మారుతోంది. ఒకవైపు శ్రీ భవానీ మండల దీక్షల స్వీకరణతో కొండపై ఆధ్యాత్మిక సందడి నెలకొనగా.. మరోవైపు కార్తీక పౌర్ణమి మహోత్సవానికి ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల జయజయధ్వానాలు, అమ్మవారి నామస్మరణల మధ్య ఇంద్రకీలాద్రి భక్తి పారవశ్యంలో మునిగిపోతోంది.

భవానీ దీక్షలతో భక్తుల సందడి..

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో భవానీ మండల దీక్షల స్వీకరణ రెండో రోజు శనివారం వైభవంగా కొనసాగింది. వందలాది మంది భక్తులు కొండపైకి చేరుకుని మహామండపం ఆరో అంతస్తులో కొలువుదీరిన శ్రీ భవానీ అమ్మవారి సన్నిధిలో గురుభవానీల సమక్షంలో శాస్త్రోక్తంగా దీక్షా మాలధారణ చేశారు. సెలవు దినం కావడంతో తెల్లవారుజాము నుంచే ఘాట్ రోడ్డు, లిఫ్ట్ మార్గాల్లో భక్తుల రాకపోకలు పెరిగాయి. కనకదుర్గమ్మ దర్శనానికి భక్తులు బారులు తీరారు.

క్షేత్రస్థాయిలో ఈవో తనిఖీలు.. సిబ్బందికి హెచ్చరిక..

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ ఘాట్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దర్శనం, ప్రసాదం టికెట్ కౌంటర్లు, చెప్పుల స్టాండ్, క్లోక్ రూమ్‌లను పరిశీలించారు. టికెట్ల జారీ, స్కానింగ్ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. భక్తులకు సేవలందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

24న కార్తీక దీపోత్సవం.. ఇంద్రకీలాద్రి దీపకాంతులతో వెలుగులు..

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 24వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఇంద్రకీలాద్రిపై కార్తీక దీపోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం సిద్ధమైంది. ఈ వేడుకను ఆధ్యాత్మిక శోభతో నిర్వహించేందుకు ఆలయ పరిసరాలను ఎనిమిది ప్రధాన సెక్టార్లుగా విభజించి ఏర్పాట్లు చేపట్టారు.

ప్రధాన ఆలయం, అష్టలక్ష్మి మండపం, ఉపాలయాలు, ఆర్జిత సేవా ప్రాంగణాలు, చిన రాజగోపురం, ఓం టర్నింగ్, మల్లేశ్వర స్వామి ఆలయ మార్గం, మహామండపం నుంచి దిగువన కనకదుర్గ నగర్ ప్రారంభం వరకు దీపాలంకరణలు చేయనున్నారు. ఓం, స్వస్తిక్, శివలింగం, శ్రీచక్రం వంటి ఆధ్యాత్మిక ఆకృతుల్లో రంగవల్లులు, పూల అలంకరణలు, దీపాల ఏర్పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

700 మందికి పైగా సేవాదారులు.. ప్రత్యేక అలంకరణలు..



దీపోత్సవ ఏర్పాట్లలో భాగంగా 700 మందికి పైగా సేవాదారులను వినియోగించనున్నారు. మామిడి తోరణాలు, అరటి చెట్లతో ఆలయ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అదే రోజు రాత్రి శ్రీ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో జ్వాలాతోరణం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

సమన్వయమే కీలకం..

కార్తీక పౌర్ణమి వేడుకకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఈవో వి.కె. శీనా నాయక్ ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, భద్రత, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

కాకినాడలో కూటమి విజయమే లక్ష్యం.. ఐక్యతే అసలైన బలం

పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు: మంత్రి నాదెండ్ల మనోహర్

కాకినాడ(ప్రశ్న న్యూస్) కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికలను కూటమి ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మూడు పార్టీల మధ్య సమన్వయం, కార్యకర్తల ఐక్యత, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావడమే విజయానికి కీలకమని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) చైర్మన్ నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. మేయర్ అభ్యర్థి ఆకుల భవానితో పాటు కూటమి కార్పొరేటర్ అభ్యర్థుల విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.శనివారం కాకినాడలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ సమావేశంలో మంత్రి మనోహర్ పాల్గొన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నియమించిన సమన్వయ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా చర్చించడంతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల పరిస్థితులు, ప్రచార సరళి, అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, పార్టీల మధ్య సమన్వయంపై ఆరా తీశారు.

చిన్న విభేదాలు పక్కనపెట్టండి..

స్థానిక సంస్థల తొలి దశ ఎన్నికల్లో కూటమి సాధించిన ఫలితాల స్ఫూర్తిని కొనసాగించాలని మనోహర్ సూచించారు. కాకినాడ నగరపాలక సంస్థలో జనసేన జెండా ఎగురవేసేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని అన్నారు. మూడు పార్టీల నాయకులు నిరంతరం చర్చించుకుంటూ ముందుకు సాగితే సమన్వయ సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. ఎక్కడైనా చిన్నచిన్న ఇబ్బందులు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.నాయకుల మధ్య సఖ్యత మాత్రమే సరిపోదని, క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తల మధ్య కూడా పరస్పర సమన్వయం అవసరమని స్పష్టం చేశారు. నాయకులు సమావేశాలకే పరిమితం కాకుండా కార్యకర్తలను నిరంతరం సంప్రదిస్తూ ఎన్నికల కార్యాచరణను పర్యవేక్షించాలని దిశానిర్దేశం చేశారు.

ప్రతి ఓటరు వద్దకు వెళ్లాల్సిందే..



ఎన్నికల్లో గెలుపు కోసం ప్రతి ఓటరును ప్రత్యక్షంగా కలవాలని, వారి సమస్యలను తెలుసుకుని ఓటు అభ్యర్థించాలని మంత్రి సూచించారు. స్థానిక సమస్యలపై స్పష్టమైన అవగాహనతో పాటు రెండున్నరేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ఓటర్లు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పేలా అభ్యర్థులు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. చిన్నచిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే చొరవ చూపాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సుజయ కృష్ణ రంగారావు, కాకినాడ జెడ్పీ చైర్మన్ డాక్టర్ బుర్రా దివ్య సునీత రాజ్, కూటమి నాయకులు చిక్కాల రామచంద్రరావు, తోట సుధీర్, వేగుళ్ల లీలాకృష్ణ, తలాటం సత్య తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులకు అండగా..

ఆక్వా రంగానికి జోష్

వేట నిషేధ భృతి రెట్టింపు.. 1.34 లక్షల కుటుంబాలకు

రూ.268.60 కోట్ల భరోసా



అమరావతి(ప్రశ్న న్యూస్) సముద్రపు అలలతో పోరాటం.. ప్రకృతి వైపరీత్యాలతో సహవాసం.. రెక్కల కష్టాన్నే నమ్ముకుని జీవించే గంగపుత్రుల జీవితాల్లో ఆర్థిక భరోసా నింపేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వేట నిషేధ సమయంలో అందించే ఆర్థిక సాయాన్ని రెట్టింపు చేయడం నుంచి ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ, మత్స్యకారుల హక్కుల పరిరక్షణ వరకు పలు నిర్ణయాలు తీసుకున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మత్స్యకారులు, ఆక్వా రైతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించారు.

రూ.10 వేల నుంచి రూ.20 వేలకు భృతి..

వేట నిషేధ సమయంలో ఉపాధి కోల్పోయే మత్స్యకారులకు గతంలో అందించే రూ.10 వేల సహాయాన్ని రూ.20 వేలకు పెంచినట్లు మంత్రి తెలిపారు. 'మత్స్యకారుల సేవలో' పథకం కింద 2026-27లో తొలి విడతగా 1,28,388 కుటుంబాలకు రూ.256.776 కోట్లు విడుదల చేయగా, రెండో విడతలో మరో 5,910 కుటుంబాలకు రూ.11.82 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మొత్తంగా 1,34,298 కుటుంబాలకు రూ.268.60 కోట్ల ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.సంప్రదాయ మత్స్యకారుల జీవనోపాధి, సహకార సంఘాల హక్కులకు భంగం కలిగించిందన్న విమర్శలు ఎదుర్కొన్న జీవో 217ను రద్దు చేసి వారి ప్రయోజనాలను పరిరక్షించినట్లు పేర్కొన్నారు.

ఆక్వా రైతులకు విద్యుత్ ఉపశమనం..

రాష్ట్రంలో సుమారు 2.16 లక్షల మంది రైతులు 5.79 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారని మంత్రి వివరించారు. అర్హులైన నమోదిత ఆక్వా రైతులకు జోన్, నాన్‌జోన్ పరిమితులతో సంబంధం లేకుండా యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందించే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఉత్పత్తి వ్యయంలో కీలకమైన విద్యుత్ ఖర్చు తగ్గితే రైతులకు పెట్టుబడి భారం కొంతమేర తగ్గుతుందని పేర్కొన్నారు. మత్స్యకారుల పడవలకు లీటరు డీజిల్‌పై రూ.9 రాయితీ అందిస్తున్నామని, 2026-27 బడ్జెట్‌లో ఇందుకోసం రూ.52 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. 200 యాంత్రిక పడవలను 60 శాతం రాయితీతో అందించే కార్యక్రమాన్ని కూడా కార్యరూపంలోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

మత్స్యరంగానికి రూ.2,328 కోట్ల ప్రాజెక్టులు..

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద రాష్ట్రంలో రూ.2,328.89 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని మంత్రి తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.681.38 కోట్లు కాగా, పథకంలోని 41 రకాల కార్యక్రమాల ద్వారా 5,23,269 యూనిట్లు మంజూరయ్యాయని వివరించారు. వీటిలో 4,58,139 యూనిట్ల అమలు ప్రారంభమైనట్లు వెల్లడించారు.మత్స్యకారుల జీవనోపాధి, పోషకాహార సహాయానికి సంబంధించి 4,42,720 యూనిట్లతో పాటు 776 ఐస్‌బాక్స్ మోటారు సైకిళ్లు, 2,269 మినీ ఫిష్ కియోస్క్‌లు, 8,144 కమ్యూనికేషన్, ట్రాకింగ్ పరికరాల యూనిట్ల అమలు ప్రారంభమైందన్నారు.మత్స్య ఉత్పత్తుల నిల్వ, రవాణా, విక్రయాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా మూడు ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు, 16 కోల్డ్ స్టోరేజీలు, ఐస్ ప్లాంట్లు, ఐదు మేత తయారీ ప్లాంట్లు, ఒక సమగ్ర ఆక్వా పార్కు ఏర్పాటుకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు.

కోవూరులో కూటమి పాగా వేయాలి

సర్పంచి అభ్యర్థిగా వల్లెపు సునీల్‌బాబుకు మద్దతు



నెల్లూరు(ప్రశ్న న్యూస్) కోవూరు పంచాయతీలో కూటమి జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎన్నికల సమరానికి సన్నద్ధమయ్యారు. సర్పంచి అభ్యర్థిగా వల్లెపు సునీల్‌బాబును కూటమి తరపున బలపరుస్తున్నట్లు ప్రకటించారు. ఆయనతో పాటు 20 వార్డుల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. శనివారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో కోవూరు పంచాయతీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె ఈ నిర్ణయాన్ని వెల్లడించారు.

సునీల్‌బాబుకు సంపూర్ణ మద్దతు..

ఉన్నత విద్యావంతుడిగా, సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న వల్లెపు సునీల్‌బాబుకు సర్పంచిగా పనిచేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. కోవూరు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు విభేదాలకు తావివ్వకుండా సునీల్‌బాబు విజయానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

20 వార్డులపైనా గురి...

సర్పంచి స్థానంతో పాటు 20 వార్డుల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీల మధ్య సమన్వయం, ఐక్యతే విజయానికి కీలకమని స్పష్టం చేశారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే కోవూరు అభివృద్ధి, ప్రజల సంక్షేమానికే ప్రాధాన్యమిస్తూ అభ్యర్థుల ఎంపిక నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ఎన్నికలను బాధ్యతగా తీసుకొని ప్రజల్లోకి వెళ్లాలని కోరారు.

పంచాయతీకి ఇవే చివరి ఎన్నికలా..

కోవూరును భవిష్యత్తులో మున్సిపాలిటీగా అభివృద్ధి చేసి తీరుతామని ప్రశాంతిరెడ్డి స్పష్టం చేశారు. పంచాయతీగా కోవూరుకు ఇవే చివరి ఎన్నికలు అవుతాయని పేర్కొన్నారు. మెరుగైన మౌలిక సదుపాయాలు, ప్రణాళికాబద్ధమైన పట్టణాభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ అభివృద్ధి ప్రస్థానంలో ప్రజలతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఆయుర్వేద వైద్యానికి ప్రభుత్వ నిర్లక్ష్యం

- డిస్పెన్సరీల్లో మందుల కరువు.. రోగులకు మొండి చేయి
- వైద్యులు ఉన్నారు, సిబ్బంది ఉన్నారు, లక్షల్లో జీతాలు ఉన్నాయి, కానీ మందులే లేవు
- మూడు నెలలకు కిలో అశ్వగంధనా.? మిగతా చూర్ణాలు అసలే లేవు, వేలాది మంది రోగులకు ఇదేనా వైద్య సేవలు.?
- అశ్వగంధ, శతావరి నుంచి త్రిఫల చూర్ణం వరకు.. నిత్యం అవసరమైన మందులన్నీ కొరతే
- ఆయుర్వేద విభాగంను పట్టించుకోని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా





డిస్పెన్సరీల్లో వైద్యులు, ఫార్మసిస్టులు, ఇతర సిబ్బందిని నియమించి జీతాలు చెల్లిస్తున్నప్పుడు రోగులకు అవసరమైన మందులు సరఫరా చేయడంలో తెలంగాణ ప్రభుత్వ నిర్లక్ష్యం ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. డిస్పెన్సరీల సంఖ్య పెంచడం మాత్రమే కాకుండా, వాటికి సరిపడా ఔషధాలను అందుబాటులో ఉంచినప్పుడే ప్రజలకు నిజమైన వైద్య సేవలు అందుతాయని అభిప్రాయపడుతున్నారు.

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆయుర్వేదానికి పుట్టినిల్లుగా పేరొందిన భారతదేశంలోనే ఆయుర్వేద వైద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడం విడ్డూరంగా మారింది. ప్రజలకు సంప్రదాయ వైద్యాన్ని అందించాల్సిన తెలంగాణ రాష్ట్రంలోని ఆయుర్వేద డిస్పెన్సరీలు మందుల కొరతతో వెలవెలబోతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైద్యులు, సిబ్బందిని నియమించి లక్షలాది రూపాయలు వేతనాల రూపంలో ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, రోగులకు అవసరమైన మందులను మాత్రం ఎందుకు సరఫరా చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అశ్వగంధ, శతావరి, జటామాంసి, పునర్నవ, పల్లేరు, త్రిఫల చూర్ణం, సునాముఖి, తిప్పతీగ చూర్ణం, వేప చూర్ణం, అతిబల చూర్ణం, అతిమధురం, జీర్ణకోశ సమస్యలకు వినియోగించే హింగ్వాష్టక చూర్ణం వంటి సాధారణ ఆయుర్వేద ఔషధాలు సైతం అనేక డిస్పెన్సరీల్లో అందుబాటులో లేవని రోగులు వాపోతున్నారు. సాధారణ సమస్యలతో వచ్చే పేదలు, వృద్ధులు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలకు వెళ్లినా అవసరమైన మందులు లభించక నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడు నెలలకు కిలో అశ్వగంధ.. ఎలా సరిపోతుంది.?

ఒక్కో ఆయుర్వేద డిస్పెన్సరీకి రోజుకు సుమారు 30 నుంచి 50 మంది వరకు రోగులు వస్తుంటారని చెబుతున్నారు. అలాంటప్పుడు మూడు నెలలకు ఒకసారి కేవలం ఒక కిలో అశ్వగంధ, ఇతర మందుల పొడిని కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు నిలదీస్తున్నారు. ఇంత తక్కువ పరిమాణంలో మందులు సరఫరా చేస్తే రోగులందరికీ ఎలా అందించగలరని ప్రశ్నిస్తున్నారు. మందుల కేటాయింపులు రోగుల సంఖ్యకు అనుగుణంగా ఉన్నాయా.? అవసరాలకు తగ్గట్టుగా ఔషధాల కొనుగోళ్లు జరుగుతున్నాయా.? లేక మందుల సరఫరా లో గోల్మాల్ జరుగుతోందా.? అన్న అంశాలపై ఉన్నతాధికారులు సమీక్షించాల్సిన అవసరం ఉంది.

చిన్నారుల మందులకూ కొరతే

చిన్నపిల్లలకు ఉపయోగించే అశ్వగంధ లేహ్యం, సరస్వతి లేహ్యంతో పాటు రోగనిరోధక శక్తికి తోడ్పడే చ్యవన్‌ప్రాశ్ వంటి ఔషధాలు, వివిధ రకాల ఆయుర్వేద గుళికలు కూడా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. సంప్రదాయ వైద్యంపై నమ్మకంతో ప్రభుత్వ డిస్పెన్సరీలను ఆశ్రయించే పేద కుటుంబాలకు మందులు అందకపోవడం ప్రభుత్వ వైద్య సేవల లక్ష్యానికే విరుద్ధమని విమర్శలు వినిపిస్తున్నాయి.

జీతాలకు నిధులు ఉన్నాయి.. మందులకు నిధులు లేవా.?

కమిషనర్, ఆరోగ్యశాఖ మంత్రి స్పందించాలి

ఇప్పటికైనా ఆయుష్ విభాగం కమిషనర్, తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా తక్షణమే స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి ఆయుర్వేద డిస్పెన్సరీకి రోగుల సంఖ్య ఆధారంగా నెలవారీ మందుల కేటాయింపులు పెంచాలని, అవసరమైన చూర్ణాలు, లేహ్యాలు, గుళికలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. అసలు ఇప్పటివరకు ఆరోగ్య శాఖ మంత్రి ఆయుర్వేద మందులపై సమీక్ష నిర్వహించారా.? నిర్వహిస్తే ఇంత దారుణమైన పరిస్థితులు డిస్పెన్సరీలో ఉంటే ఎందుకు వాటిని చక్కదిద్దలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మందుల కొరతపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సరఫరా వ్యవస్థను ప్రక్షాళన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేక మందులను ప్రభుత్వం సరఫరా చేస్తున్న మధ్యలో స్వాహా అవుతున్నాయా.? లేక మందులు కేవలం పేపర్లకే పరిమితమై వాస్తవానికి సరఫరా జరగకుండా ప్రైవేటు ఆయుర్వేద మెడికల్ షాపులకు సరఫరా అవుతున్నాయా.? అన్న దానిపై కూడా పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలి. ఆయుర్వేద వైద్యాన్ని మాటల్లో కాకుండా చేతల్లో ప్రోత్సహించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగుల పిల్లలకు ఉచితంగా
క్యాన్సర్ నిరోధక టీకాలు

హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌కు టీటీడీ శ్రీకారం..

రూ.14 వేల విలువైన గార్డాసిల్-9 టీకా ఉచితంగా పంపిణీ



తిరుపతి(ప్రశ్న న్యూస్) టీటీడీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు తిరుమల తిరుపతి దేవస్థానం మరో కీలక ముందడుగు వేసింది. క్యాన్సర్ ముప్పును తగ్గించే హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిల్లోమా వైరస్) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. 9 నుంచి 25 ఏళ్లలోపు అర్హులైన ఉద్యోగుల పిల్లలకు అత్యాధునిక గార్డాసిల్-9 వ్యాక్సిన్‌ను పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర వెల్లడించారు. శనివారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవన ప్రాంగణంలో ఉన్న సెంట్రల్ ఆసుపత్రిలో ఈ కార్యక్రమాన్ని ఈవో ప్రారంభించారు. తొలి విడతలో 2,000 డోసులను సేకరించినట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి మరిన్ని డోసులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు వారి కుటుంబాల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. అర్హులైన ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్యాన్సర్ ముప్పును తగ్గించే టీకా..

టీటీడీ సీఎంఓ డాక్టర్ కుసుమకుమారి మాట్లాడుతూ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో సర్వైకల్ క్యాన్సర్‌తో పాటు ఇతర హెచ్‌పీవీ సంబంధిత క్యాన్సర్ల ముప్పును తగ్గించవచ్చని వివరించారు. బాలికలతో పాటు బాలురకు కూడా ఈ టీకా ప్రయోజనకరమని తెలిపారు. హెచ్‌పీవీకి చెందిన తొమ్మిది రకాల వైరస్ వేరియంట్ల నుంచి రక్షణ కల్పించడం గార్డాసిల్-9 ప్రత్యేకత అని చెప్పారు.

మార్కెట్ ధర రూ.14 వేలు.. టీటీడీకి రూ.3 వేలకే..

మార్కెట్‌లో ఒక్కో గార్డాసిల్-9 డోసు ధర సుమారు రూ.13 వేల నుంచి రూ.14 వేలకుపైగా ఉండగా, టీటీడీకి కంపెనీ రాయితీపై ఒక్కో డోసు రూ.3 వేలకే లభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. టీటీడీ నిధులతో అర్హులైన ఉద్యోగుల పిల్లలకు ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించనున్నారు.

వయస్సును బట్టి డోసులు..

9 నుంచి 14 ఏళ్లలోపు వారికి తొలి డోసు వేసిన ఆరు నెలల తర్వాత రెండో డోసు ఇవ్వనున్నారు. 15 నుంచి 25 ఏళ్లలోపు వారికి తొలి డోసు తర్వాత రెండు నెలలకు రెండో డోసు, ఆరు నెలలకు మూడో డోసు ఇవ్వనున్నట్లు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో (హెల్త్ అండ్ ఎడ్యుకేషన్) ప్రభల గోపీనాథ్, డివ్యూటీ ఈవో ఆనందరాజు, వైద్యులు డాక్టర్ శివకుమార్, పారామెడికల్ సిబ్బంది, టీటీడీ ఉద్యోగులు, వారి పిల్లలు పాల్గొన్నారు.

తెలంగాణను వణికిస్తున్న చలి

- తగ్గుతున్న ఉష్ణోగ్రతలు.. పెరుగుతున్న చలితీవ్రత- తెల్లవారుజామున పొగమంచు.. రాత్రివేళ గజగజ వణుకు

- వృద్ధులు, చిన్నారులు, కార్మికులపై చలి పంజ

"తెలంగాణ రాష్ట్రాన్ని చలి వణికిస్తోంది. రోజురోజుకూ మారుతున్న వాతావరణ పరిస్థితులతో చలితీవ్రత పెరుగుతున్నట్లు ప్రజలు భావిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో, తెల్లవారుజామున చల్లని గాలులు వీస్తుండటంతో బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఉదయం సూర్యుడు కనిపించే వరకు చలి ప్రభావం తగ్గకపోవడంతో సాధారణ జనజీవనం ఇబ్బందులకు గురవుతోంది. ఒకవైపు చల్లని గాలులు.. మరోవైపు పొగమంచు.. ఇంకోవైపు పడిపోతున్న ఉష్ణోగ్రతలు.. ఇలా మారుతున్న వాతావరణం ప్రజలకు చలికాలం తీవ్రతను గుర్తుచేస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు, రాత్రి ప్రయాణాలు చేసే వాహనదారులు చలి ప్రభావాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నారు"



మేడ్చల్(ప్రశ్న న్యూస్) చలి ప్రభావం కారణంగా ఉదయం పనులకు వెళ్లే ఉద్యోగులు, కూలీలు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా నిర్మాణ రంగ కార్మికులు, రోడ్లపై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు, పాలు, పేపర్లు పంపిణీ చేసే సిబ్బందికి చలి పెద్ద సవాలుగా మారుతోంది. తెల్లవారుజామున విధులకు వెళ్లే వారు స్వెటర్లు, మఫ్లర్లు, దుప్పట్లు ధరించి బయటకు వస్తున్నారు. మరోవైపు ఉదయం నడకకు వెళ్లేవారి సంఖ్య కూడా తగ్గుతున్నట్లు కనిపిస్తోంది.



పడిపోతున్న ఉష్ణోగ్రతలు.. ఇదీ పరిస్థితి

నవంబర్ 16న నమోదైన వాతావరణ వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 11.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో 12.6 డిగ్రీలు, మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్‌లో 13.1 డిగ్రీలు నమోదయ్యాయి.

మేడ్చల్ లో 16.5డిగ్రీల కనిష్ఠ నమోదయ్యాయి.ఉష్ణోగ్రత హైదరాబాద్‌లోని పటాన్‌చెరులో 13.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ పరిస్థితులు రాష్ట్రంలో చలి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

వృద్ధులు, చిన్నారుల విషయంలో అప్రమత్తత అవసరం

చలికాలంలో వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లని గాలులకు ఎక్కువసేపు గురికాకుండా చూసుకోవాలి. తగినంత వెచ్చని దుస్తులు ధరించాలి. ఉదయం, రాత్రి వేళల్లో అవసరం లేకుండా బయట తిరగడం తగ్గించాలి. శ్వాస సంబంధిత ఇబ్బందులు ఉన్నవారు వైద్యుల సూచనలు పాటించాలి.

చలిమంటలే దిక్కు.. పేదల పరిస్థితి ఏమిటి.?

చలి పెరిగిన ప్రతిసారీ పేదలు, నిరాశ్రయులు ఎదుర్కొనే కష్టాలు మరింత పెరుగుతున్నాయి. సరైన ఇళ్లు లేని వారు, ఫుట్‌పాత్‌లపై జీవించే వారు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద రాత్రులు గడిపేవారు చలికి అల్లాడుతున్నారు. మరోవైపు రాత్రి విధులు నిర్వహించే భద్రతా సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు, రోడ్డు పక్కన జీవనోపాధి పొందేవారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. ఇలాంటి వారిని గుర్తించి అవసరమైన చోట్ల చలికాలపు ఆశ్రయాలు, దుప్పట్లు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది.

అధికారుల దృష్టికి.. ప్రజలకు భరోసా కల్పించాలి

చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో స్థానిక సంస్థలు, ప్రభుత్వ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. నిరాశ్రయులకు రాత్రి ఆశ్రయాలు కల్పించడం, అవసరమైన వారికి దుప్పట్లు పంపిణీ చేయడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చలికాలపు అనారోగ్య సమస్యలకు తగిన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచడం అత్యవసరం.

ప్రకృతి మార్పులపై అప్రమత్తంగా ఉండాలి!

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం నవంబర్ 19 వరకు ఉదయం వేళల్లో మబ్బు, పొగమంచు తరహా వాతావరణం ఉండే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం తెలంగాణకు ప్రత్యేక చలిగాలుల హెచ్చరిక జారీ కాలేదని వాతావరణ నివేదికలు సూచిస్తున్నాయి. ప్రజలు వాతావరణ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు గమనించాలి.

భవిష్యత్‌లో ప్రమాదం రాబోతోంది..
తుపాకులు కొనుక్కోండి

- రాజాసింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భవిష్యత్తులో దేశంలో హిందువుల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే భద్రతా ముప్పులను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణ పద్ధతులను నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. చట్టప్రకారం అనుమతులు పొంది ప్రతి హిందువు తప్పనిసరిగా లైసెన్స్‌డ్ తుపాకీని దగ్గర ఉంచుకోవాలని అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడిన వీడియో దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ముస్లింల జనాభా నానాటికీ పెరిగిపోతోందని రాజాసింగ్ తన వీడియోలో ప్రస్తావించారు. దీనివల్ల కాలక్రమేణా భారతదేశంలో హిందువుల ఉనికికి, భద్రతకు పెను సవాలు ఎదురవుతుందని వ్యాఖ్యానించారు. అలాంటి అనిశ్చిత పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు సమాజం ఎలా తట్టుకుంటుందని ప్రశ్నించారు. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఇప్పటి నుంచే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా ధీటుగా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఆత్మరక్షణ కోసమే తుపాకులు కొనుగోలు చేయాలని చెప్పిన ఆయన, దానికి సంబంధించి చట్టబద్ధమైన నిబంధనలను పాటించాలని గుర్తుచేశారు. ఈ వీడియో నెట్టింట బయటకు రావడంతో తీవ్ర దుమారం చెలరేగింది. ఒక ప్రజాప్రతినిధి బహిరంగంగా ఇలాంటి పిలుపునివ్వడంపై రాజకీయ పక్షాలు, సామాజిక వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

తిరుమల శ్రీవారికి 121 కిలోల బంగారం విరాళం

- టీటీడీ చరిత్రలో ఇదే అతిపెద్ద కానుక!



తిరుమల (ప్రశ్న న్యూస్) కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి ఓ భక్తుడు అరుదైన, అత్యంత భారీ కానుకను సమర్పించేందుకు సిద్ధమయ్యారు. ఏకంగా 121 కిలోల బంగారు ఆభరణాలను శ్రీవారికి విరాళంగా ప్రకటించారు. ఈ నెల 26న (2026 నవంబర్ 26) ఈ ఆభరణాలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి అధికారికంగా అందజేయనున్నారు. ప్రస్తుతం మార్కెట్ లెక్కల ప్రకారం ఈ బంగారు ఆభరణాల విలువ సుమారు రూ160 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. స్వామివారి కోసం మొత్తం 45 రకాల స్వర్ణాభరణాలను 9 ప్రత్యేక సెట్లుగా అత్యంత నైపుణ్యంతో తయారు చేయించారు. ఈ భారీ విరాళాన్ని అందజేస్తున్న భక్తుడు తన పేరును, వ్యక్తిగత వివరాలను వెల్లడించడానికి ఏమాత్రం ఇష్టపడలేదని సమాచారం. గోప్యత పాటిస్తూ పూర్తిగా స్వామివారి భక్తి ప్రపత్తులతోనే ఈ విరాళాన్ని అందజేస్తున్నారు. ఈ 121 కిలోల ఆభరణాల సమర్పణ వెనుక ఒక ప్రత్యేక విశేషం ఉంది. తిరుమల శ్రీవారి మూలవిరాట్‌కు నిత్య అలంకరణలో ఉపయోగించే బంగారు ఆభరణాల మొత్తం బరువు సుమారు 120 కిలోల వరకు ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకున్న ఆ భక్తుడు, మూలవిరాట్ అలంకరణకు సరిపోయేలా 120 కిలోలకు అదనంగా మరో కిలో కలిపి మొత్తం 121 కిలోల బంగారంతో విశేష ఆభరణాలను సిద్ధం చేయాలని సంకల్పించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588